www.prajapaksham.in
PRAJAPAKSHAM ★
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
సంపుటి 26, సంచిక: 343 | ఆదివారం | 02-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

తెలంగాణ...
పదేండ్ల పండుగ
గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ॥ ఎనుముల రేవంత్ రెడ్డి గారిచే
ఉ. 09:30 గంటలకు గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించుట,
ఉ. 10:00 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకావిష్కరణ
మరియు గౌరవ వందన స్వీకారం.
యావత్ తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు మరియు సాదర ఆహ్వానం

తెలంగాణ...
పదేండ్ల పండుగ
గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ॥ ఎనుముల రేవంత్ రెడ్డి గారిచే
ఉ. 09:30 గంటలకు గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించుట,
ఉ. 10:00 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకావిష్కరణ
మరియు గౌరవ వందన స్వీకారం.
యావత్ తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు మరియు సాదర ఆహ్వానం



# జయ జయహే తెలంగాణ... జననీ జయకేతనం







అందెశ్రీ

**ప్రభుత్వం ఆమోదించిన రాష్ట్ర గీతం**
**(నిడివి పదమూడున్నర నిముషాలు)**

జయ జయహే తెలంగాణ... జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పది జిల్లాల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

2.పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి
భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి
హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల
బృహత్ కథల తెలంగాణ కోటిలింగాల కోన
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

3.ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించాలని
తెలుగులో తొలి ప్రజాకవి పాలకుర్కి సోమన్న
రాజ్యాన్నే ధిక్కరించి రాములోరి గుడిని గట్టి
కవిరాజై వెలిగె దిశల కంచర్ల గోపన్న
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

4.కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టు
మల్లినాథసూరి మా మెతుకుసీమ కన్నబిడ్డ
ధూళికట్ట నేలినట్టి బౌద్ధానికి బంధువతడు
ధిజ్ఞాగుని కన్న నేల ధిక్కారమె జన్మహక్కు
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

5.పోతనదీ పురిటిగడ్డ.. రుద్రమదీ వీరగడ్డ
గండర గండడు కొమురం భీముడే నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోలుకొండ భాగ్యనగరి గొప్ప వెలుగు చార్మినారు
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

6.రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల
సర్వజ్ఞ సింగభూపాలుని బంగరు భూమి
వాణీ నా రాణీ అంటు నినదించిన కవికుల రవి
పిల్లలమర్రి పినవీరభద్రుడు మాలో రుద్రుడు
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

7.సమ్మక్కలు సారక్కలు సర్వాయిపాపన్నలు
సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు
ఊరూర పాటలైన ''మీరసాబు'' వీరగాథ
దండు నడిపే పాలమూరు ''పండుగోల్ల సాయన్న''
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

8.కవిగాయక వైతాళిక కళల మంజీరాలు
డప్పూ ఢమరుకము, డక్కి, శారద స్వరనాదాలు
పల్లవుల చిరుజల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ
అనునిత్యము నీ గానం అమ్మ నీవే మా ప్రాణం
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

9.జానపదా జనజీవన జావళీలు జాలువార
జాతిని జాగృత పరచే గీతాల జనజాతర
వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతేనేమి
తరగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమయాగం
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

10.బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి
విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి
తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక
ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మా వెలగాలి
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

11. సిరి వెలుగులు విరజిమ్మే సింగరేణి నల్ల బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువున సింగారం
సహజమైన వనసంపద సక్కనైన పువ్వులపొద
సిరులు పండె సారమున్న మాగాణమె కదా! నీ యెద
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

12.గోదావరి క్రిష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగా
పచ్చని మానేలల్లో పసిడిసిరులు పండంగా
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా వుండాలి
ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

***(గమనిక: ఇందులోని 1,9,12 చరణాలతో రెండున్నర నిముషాలనిడివితో సంక్షిప్తంగా రాష్ట్రగీతం రికార్డు చేయబడింది. సంగీతం: కీరవాణి)***





## బండెనుక బండి కట్టి..

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉర్రూతలూగించిన బండి యాదగిరి పాట**

బండెనుక బండి కట్టి
పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లె వస్తవ్ కొడుకో
నైజాము సర్కరోడా
నాజీల మించినవ్ రో
నైజాము సర్కరోడా

పోలీసు మిలిట్రి రెండు
బలవంతులనుకోని
నువ్వు పల్లెలు దోస్తివి కొడుకో
మా పల్లెలు దోస్తివి కొడుకో
నైజాము సర్కరోడా

స్త్రీ పురుషులంత గలిసి
ఇల్లాలమంత గలిసి
వడిసేల రాళ్లు గట్టి
వడివడిగ గొట్టితేను
కారాపు నీళ్లు దెచ్చి
కండ్లళ్ల జల్లితేను
నీ మిలిట్రి బారిపాయెరో
నీ మిలిట్రి బారిపాయెరో&
నైజాము సర్కరోడా

సుట్టుముట్టూ సూర్యపేట,
నట్టనడుమ నల్లగొండ
నువ్వుండేది హైద్రబాదు
దాని పక్క గోలుకొండ
గోలుకొండా ఖిలా కిందా
గోలుకొండా ఖిలా కిందా
నీ గోరి కడుతం కొడుకో
నైజాము సర్కరోడా

బండి యాదగిరి



# జయహో తెలంగాణ!

'ఈ నేల మనదిరా – ఈ నీరు మనదిరా... దొర ఏందిరో .. వాడి పీకుడేందిరో' అని నిజాం నిరంకుశ ముష్కర పాలనకు వ్యతిరేకంగా, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ మట్టి మనుషులు గుదపలు, బందూకులు చేతబట్టి ఫ్యూడల్ – భూస్వామ్య రాచరిక ఏలుబడిని కూల్చి, తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చి, భారత యూనియన్‌లో భాగం చేసిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సరిసాటి ఈ చరిత్రలో మరొకటి ఉందా? దాదాపు 4 వేలమంది కమ్యూనిస్టుల త్యాగ ఫలితమే 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం, హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటు. 1952 ఎన్నికల్లో ఆ స్టేట్‌లోని తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టులకు మెజారిటీ లభించింది. అయితే కన్నడ, మరాఠా ప్రాంతాల కారణంగా అధికారం వారి చేతికి అందలేదు. పరిపాలనకు భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఉత్తమం అన్న స్వాతంత్ర్యోద్యమ భావనను ఆచరణలోకి తెస్తూ నెహ్రూ ప్రభుత్వం ఫజులాలీ కమిషన్‌ను నియమించింది. అది చారిత్రక కారణాల రీత్యా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం మేలని చెప్పినప్పటికీ అప్పటి పాలక కాంగ్రెస్ నాయకుల మధ్య ఏకాభిప్రాయం ప్రకారం 'పెద్దమనుషుల ఒప్పందం'తో 1956 నవంబర్ 1న ఆంధ్ర– తెలంగాణ ప్రాంతాల విలీనంతో హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. అప్పటి ప్రతిపక్షం భారత కమ్యూనిస్టు పార్టీ దాన్ని బలపరిచింది. అయితే బలవంతపు వివాహం –మనసులు కలవని కాపురంలా ఉప్పు–నిప్పుగా కొనసాగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో – పరిపాలనలో తెలంగాణ పట్ల వివక్ష, అన్యాయం పేరుతో పుష్కరం తిరగకుండానే 1969లో ప్రత్యేక తెలంగాణ ఆందోళన ఉవ్వెత్తున ఎగిసిపడింది. కాంగ్రెస్‌లో అసమ్మతివర్గంనేత మర్రి చెన్నారెడ్డి దానికి నాయకత్వంవహించారు. కేంద్రకాంగ్రెస్ నాయకత్వం కాంగ్రెస్ నాయకుల మధ్య రాజీకుదర్చటంతో ఎన్నికల తదుపరి చెన్నారెడ్డి తమ తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అప్పటికి ఉద్యమం చల్లారినట్లు కనిపించినా కవులు, మేథావులు, కళాకారులు సహా సబ్బండతరగతుల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష నివురుగప్పిన నిప్పులా రగులుతూనేవుంది. 2009లో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడింది. కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలో ఏర్పడిన టిఆర్‌ఎస్‌ది దానిలో కీలక పాత్ర. నాలుగు దశాబ్దాలు దాటిన ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమ నాయకత్వం తొలిసారి కాంగ్రెసేతర పార్టీ చేతికి వచ్చింది.

**ప్రజాపక్షం 02-06-2024, ఆదివారం**

ఇది ఉద్యమ చరిత్రలో గుణాత్మక మార్పు. తర్వాత ఉద్యమం అంచెలంచెలుగా గ్రామ గ్రామానికి విస్తరించి అజేయమైన శక్తి అయింది. బిజెపి అంతకుముందే 'ఒక ఓటు– రెండు రాష్ట్రాల'ని తీర్మానించినందున తెలంగాణ ఉద్యమానికి ఎదురొడ్డినిలబడే పార్టీ తెలంగాణ గడ్డపై లేకపోవటం ఎంతో విలువైన విషయం. తర్వాత ఎన్నో మెలికలు, మల్లగుల్లాల తదుపరి పార్లమెంటు చట్టం ద్వారా 2014జూన్ 2న ఆంధ్రప్రదేశ్ విభజన ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా టిఆర్‌ఎస్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించింది, తొలి ముఖ్య మంత్రిగా కె. చంద్రశేఖర్‌రావు పదవీప్రమాణస్వీకారం చేశారు. 2018 ఎన్నికల్లోనూ ఆ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. అయితే ముఖ్యమంత్రి నియంతృత్వ ధోరణి, ఒంటెత్తుపోకడ ఉద్యమకారులను, ప్రజాతంత్ర శక్తులను పార్టీకి దూరంచేసింది. ఆయన అహంభావమే 2023 ఎన్నికల్లో టిఆర్‌ఎస్ ఓటమికి దారితీసింది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీకి ఓటర్లు తొలిసారి పట్టం కట్టారు. టిఆర్‌ఎస్ పాలనలోని తప్పులను, ప్రజావ్యతిరేక నిర్ణయాలను సరిదిద్దటంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రజాస్వామ్యపాలన, స్వేచ్ఛస్వాతంత్ర్యాలు, ప్రజాతంత్ర హక్కులకు హామీయిచ్చే పరిపాలన అందించాల్సినే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉంది. ఇప్పటికే రాజకీయంగా, ముఖ్యమంత్రిగా తనదైన ముద్రవేసిన రేవంత్‌రెడ్డి తమ కృషిలో విజయులు కావాలని ఆకాంక్షిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం కోసం కలలుగన్న, పోరాటాలు, త్యాగాలు చేసిన, తోడ్పాటు అందించిన యావన్మందికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

సంపాదకవర్గం

# తెలంగాణ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి



డాక్టర్ కె. నారాయణ
సిపిఐ జాతీయ కార్యదర్శి

నా పేరు తిరుపతి అంది గిరిజన యువతి ... అది మా ఊరు పేరే అని ఆప్యాయంగా పలకరించా... ఇక చిందులే

నల్లమల అడవుల పరిశీలనకు వెళ్లాం. అడవుల్లో కాలినడకన మారుమూల కేంద్రాల వద్ద కెళ్ళాం. 20 సంవత్సరాల యువతి అక్కడికి చేరుకున్నది. గిరిజనులు ఆ అమ్మాయిని నాకు మా పంచాయతీ ప్రెసిడెంట్ అని పరిచయం చేశారు. ''నీ పేరేమిటి అమ్మ అన్నాను. నా పేరు తిరుపతి అన్నది. ఓ అయితే మా ఊరు పేరే తిరుపతి అని ఆప్యాయంగా పలకరించ బోయాను. ఆ అమ్మాయి త్రాచుపాము లాగా నాపై లేచి, అది ఆంధ్రా, మాది తెలంగాణ అంది కఠోర స్వరంతో '' దీన్ని బట్టి తెలంగాణ నినాదం మారుమూల ప్రాంతాల్లో కూడా ఎలా బలపడిందో అర్థమవుతుంది. తెలంగాణ నేనే తెచ్చాను అని ఎవరైనా భుజాలెగరేసుకుంటే అది వారి మూర్ఖత్వం.

ప్రత్యేక తెలంగాణ నినాదం ఈనాటిది కాదు. అది భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాదిపదికన తెలుగు మాట్లాడే ప్రాంతమంతా ప్రత్యేక రాష్ట్రం కావాలనీ ఆందోళన ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండే పుట్టింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో ఆంధ్ర రాష్ట్ర నినాదం మారుమోగి పరాకాష్టకు చేరింది. ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. అప్పటికే ఆంధ్ర నడిబొడ్డు బెజవాడలో రాజధాని కావాలని కమ్యూనిస్టు పార్టీ కోరింది. కమ్యూనిస్టులు బలంగా ఉన్న బెజవాడలో రాష్ట్ర రాజధాని వద్దని ఆనాటి కుటిల నాయకులు కర్నూలు రాజధానిగా ఏర్పరిచారు. తదనంతరం తెలంగాణ ప్రాంతాన్ని కూడా కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ రాజధానిగా నిర్ణయించారు. అయితే ఆనాడే తెలంగాణ రాజకీయ నాయకులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలని పట్టుబట్టారు. రాజీగా పండిట్ నెహ్రూ గారే తాత్కాలికంగా కలసి ఉండండి, భవిష్యత్తులో కలిసి ఉండలేక పోతే విడాకులు తీసుకోండని రాజీమార్గంగా వివాదం ముగించారు. అయితే తెలంగాణ ప్రజల ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ వాదనకు ఆనాటి నుండే బీజం పడింది. అయితే దఫదఫాలుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నినాదం, అటు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నినాదం పెల్లుబుక్కుతూనే వుంది. నివురు గప్పిన నిప్పుకు తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ఒక రాజకీయ వేదిక ఏర్పాటు చేశారు. నిప్పురవ్వ రాజేసే ఫంకా వచ్చాక తెలంగాణ ప్రజలలో చైతన్యం పట్టుదల పెరిగి దాని మూలంకు ఆధారం ఏర్పడింది. తెలంగాణ పోరు యాత్ర సిపిఐ నిర్వహించింది. ఆనాడు సిపిఐతో దివంగత గద్దర్ కూడా గొంతు కలిపారు.

మారుమూల గ్రామాలలో కూడా చదువు సంధ్యలు లేని ప్రజలు కూడా డప్పులు, తాళాలు, నృత్యాలు, పాటలు డాన్సులతో స్వాగతం పలికారు. కళాకారుల కృషి ఉద్యమానికి వెన్నుదన్ను అయింది. ప్రధానంగా నిధులు, నీరు, ఉద్యోగాల నినాదంతో ఉద్యమం దద్దరిల్లింది.

**సిపిఐ పాత్ర:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా నేనున్నాను. నేను ఆంధ్ర వాడినే అయితే సిపిఐ జాతీయ సమితి ఆమోదంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తీర్మానాన్ని ఆమోదించాం. జాతీయ పార్టీగా ఉండి ఒక రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం తీర్మానం చేయడం అంత తేలికైనది కాదు. దానికి ప్రసవ వేదన అంతా ఇంత కాదు.

**ఒక్క ఉదాహరణ:**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిపిఐ తరఫున ఉద్యమిస్తున్నాను. అయితే ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న నేను కోస్తా, రాయలసీమ జిల్లాలకు కూడా వెళ్లే వాడిని. అక్కడ పార్టీ సమావేశాలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలలో చురుకుగా పాల్గొనే వాడిని. తిరుపతి, కర్నూలు జిల్లాల్లో నా దిష్టిబొమ్మను తగలబెట్టారు. అక్కడికే నేను వెళ్లి నా దిష్టిబొమ్మను కాదు నన్నే తగలబెట్టినా తెలంగాణ నినాదం ఆపబోమని బహిరంగంగానే సవాలు విసిరాను. ఆనాడే మీడియాలో ఒకే ఒక్కడు ఇక్కడ అక్కడ ఒకే మాట, ఒక్క నినాదం. అది ప్రత్యేక తెలంగాణ నినాదం, దానికి సింబల్ నారాయణ. అలా సిపిఐ పై ప్రశంసలు కురిపించారు.

> **“తిరుపతి, కర్నూలు జిల్లాల్లో నా దిష్టిబొమ్మను తగలబెట్టారు. అక్కడికే నేను వెళ్లి నా దిష్టిబొమ్మను కాదు నన్నే తగలబెట్టినా తెలంగాణ నినాదం ఆపబోమని బహిరంగంగానే సవాలు విసిరాను.”**

తెలంగాణ రాష్ట్ర సాధన నినాదం చివరికి ఒక్క పార్టీ, అది టిఆర్‌ఎస్ అనే కాకుండా ప్రజల నినాదంగా ప్రధాన రాజకీయ పార్టీలు భుజాన వేసుకున్నాయి. అయితే కాంగ్రెస్ గాని, బిజెపి గాని అక్కడో మాట ఇక్కడో మాట చెప్పారు తప్ప 23 జిల్లాల్లో సిపిఐ ఒక్కటే ఒకే నినాదం చెప్పగలిగింది. ఏమైతేనేం టిఆర్‌ఎస్ నాయకులు కెసిఆర్ నాయకత్వాన సోనియా గాంధీని కలవడం, తెలంగాణ ఇస్తే టిఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని హామీ ఇచ్చారని ఆ ప్రాతిపదికన శ్రీమతి సోనియా గాంధీ సిడబ్ల్యుసి తరపున ప్రత్యేక తెలంగాణ కొరకు రాజకీయ ప్రకటన చేశాడు..

ఎన్నికల ప్రక్రియలో సహజంగా జాతీయ పార్టీల సహకారం ఉన్నా తెలంగాణ నినాదానికి (పేటెంట్ హక్కు) కేసీఆర్‌కు పోయింది. అందుకే తెలంగాణ ప్రజలు టిఆర్‌ఎస్‌ను గెలిపించారు. తెలంగాణ ప్రజల హక్కులు కాపాడతామని, అభివద్ధి చేస్తామని, యువకులకు కొలువులు కల్పిస్తామని అనేక వాగ్దానాలతో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసినా, ప్రజల ఆకాంక్షలను తీర్చలేక పోయారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను (టిఆర్‌ఎస్ లోపల) క్రమంగా పక్కన పెట్టడం తెలంగాణ నినాదానికి వ్యతిరేకంగా ఉన్న వాళ్లను క్యాబినెట్లోకి మెజారిటీగా తీసుకోవడం, అభివృద్ధి చాటున భవనాలు, వాటి చిహ్నాలపై శ్రద్ధ చూపడం, అవినీతి లేని ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కెసిఆర్ అవినీతి తారాస్థాయికి చేరడం దానికి ఉదాహరణ కాళేశ్వరం ఉదంతం.

కుటుంబ పాలన, ఫామ్ హౌస్ పాలనగా మార్చడం, సచివాలయానికి రాకపోవడం, ప్రజాస్వామ్య పద్ధతులకు స్వస్తి చెప్పడం, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను కలవకపోవడం, అహంభావ వైఖరి పెరగడం జరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే రెండవ దఫా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కేసీఆర్ మహమ్మద్ ఆలీని ఉపముఖ్యమంత్రిగా నియమించి ఆరు నెలల పాటు క్యాబినేట్‌ను ఏర్పాటు చేయకుండా ఫామ్ హౌస్ కేంద్రంగా పాలన సాగించడం అహంభావానికి పరాకాష్ట. భూ సమస్య పరిష్కారం కాకపోగా ధరణి విధానంతో భూమి బద్దలయ్యింది.




టిఆర్‌ఎస్ వైఫల్యాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చురుకైన పాత్ర పోషించింది. యువకుడైన రేవంత్ రెడ్డిని పిసిసి అధ్యక్షులుగా నియమించిన కాంగ్రెస్ అధిష్టానం చురుకైన పాత్రకు నాంది పలికింది. దానితోపాటు అందరిని కలుపుకొని విస్తృత రాజకీయ ఐక్యత సాధించడంతో, కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ''ఇల్లు అలకగానే పండుగ కాదు''. గత పాలనలోను వైఫల్యాలను పరిగణలోకి తీసుకోవాలి. గత ప్రభుత్వం చేసిన దానిలో ఏదైనా మంచి ఉంటే దానిని సానుకూలంగా తీసుకోవడం, ప్రజా వ్యతిరేక విధానాలకు బహిర్గతం చేయడం, అభివృద్ధిపై శ్రద్ధ చూపి కక్ష సాధింపు చర్యలకు స్వస్తి చెప్పడం, అభివద్ధిపై యావత్ శక్తిని ఉపయోగించుకోవడం, కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, శక్తులతో విశాలవేదిక ఏర్పాటు చేసుకోవడం ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చే మార్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయగలరని ఆశిస్తున్నాను. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ తరపున విప్లవాభివందనలు తెలియజేస్తున్నాను.

# ప్రజా పాలనకు శ్రీకారం.. ఆచితూచి ప్రస్థానం..



కె. శ్రీనివాస్‌రెడ్డి
ప్రముఖ సంపాదకులు,
తెలంగాణ మీడియా అకాడెమీ చైర్మన్

తెలంగాణ శాసనసభ తాజా ఎన్నికల్లో వచ్చిన అనూహ్య మార్పుకు దిగ్భ్రాంతి చెందిన వారున్నారు. ఆనందాన్ని వ్యక్తం చేసి సంబురాలు చేసిన వారూ ఉన్నారు. లాల్‌బహదూర్ స్టేడియంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, అనుముల రేవంత్ రెడ్డి వేలాది మంది సమక్షంలో ఆనందోత్సవాల మధ్య పదవీ ప్రమాణస్వీకారం జరుగుతున్న సమయంలోనే నయా రాచరిక వ్యవస్థకు కేంద్రంగా ఉన్న 'ప్రగతి భవన్' ముళ్ళకంచెను ధ్వంసం చేసి, దళితుల పక్షపాతి జ్యోతిరావు ఫూలే పేరుతో 'ప్రజా భవన్'గా రూపుదిద్దారు. ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే రేవంత్‌రెడ్డి ఈ ప్రకటన చేసినప్పుడు వెల్లివిరిసిన ఆనందం అక్షరాలలో వర్ణించలేనిది. ప్రత్యక్షంగా తిలకించాల్సిన ఘట్టం. ఆ మాదిరిగానే సచివాలయ గేట్లు కూడా తెరుచుకున్నాయి. నూతన ముఖ్యమంత్రిని, మంత్రులను, సచివాలయాన్ని సందర్శించడానికి ప్రజలు బారులు తీరారు.

రేవంత్ రెడ్డి నాయకత్వాన ఏర్పడిన నూతన మంత్రివర్గ పాలన నల్లేరు మీద నడక కాదు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 150 రోజులు కావొస్తున్నది. అన్నీ అడ్డంకులే! అప్పుల పాలైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరి చేయడం 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' కూడా కాదు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గుక్క తిప్పుకోలేని రీతిలో వరుస కార్యక్రమాలు. శాసనసభ ఫలితాలు వెలువడగానే మంత్రి మండలి ఏర్పాటు, నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, అవినీతికి మూలమైన అంశాలపై సభలో శ్వేత పత్రాల సమర్పణ, చర్చ, ఆ వెంటనే శాఖల వారి సమీక్ష – పూర్తికాకముందే లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ – ఎన్నికల ప్రక్రియ – ప్రచారం. పరిపాలనపైన పూర్తి దృష్టి సారించడానికి సమయం తక్కువ.

అయినప్పటికీ, ఇచ్చిన హామీల అమలుకు ఆర్థిక వనరుల సమీకరణ, తక్షణమే అనువైన హామీల అమలుకు చర్యలు – అధిక మొత్తం వనరుల సమీకరణకు ఆదాయం సమకూర్చే శాఖలకు దిశా నిర్దేశాలు జరిగాయి. అధికారం చేపట్టిన మరుసటి నెల నుండీ దాదాపు ఏడు వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని, అదనపు పన్నులు లేకుండా సమకూర్చుకోవడం అతి తక్కువ సమయంలో కూడా పరిపాలన కేంద్రీకరణపై సిఎం దృష్టికి నిదర్శనం. గత ప్రభుత్వ అలసత్వానికి ఒక చురక.

రాష్ట్ర ప్రభుత్వ గత పాలన వేల కోట్ల రూపాయల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టుల నిర్మాణంలో కొరవడిన నాణ్యత, ఫలితంగా నీటి నిల్వ, విడుదల గేట్ల కుంగుబాటు ఆందోళనకరంగా మారిన సంఘటనల్లో కూడా రాజకీయ ప్రతీకారాలకు పూనుకోకుండా చట్టపరమైన విచారణలు జరిపించడం రేవంత్ రెడ్డి రాజకీయ భిన్న శైలికి ఒక నిదర్శనం. ఇది గత పాలక నేత అనుసరించిన కక్ష సాధింపు వైఖరికి విరుద్ధమైనది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డిలో భిన్న ధృవాలు గోచరిస్తున్నాయి. అధ్యక్షుడు ఒక రాజకీయ పార్టీకి, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు అనే భావన ఆయన ఆలోచనల్లో, చర్యల్లో నిండుగా, స్పష్టంగా గోచరిస్తున్నాయి. ఇది శాసనసభ ప్రతిపక్ష నేత విషయంలో ఇతర రాజకీయ పార్టీల విషయంలో గత పాలన తీరు కన్నా స్పష్టమైన సానుకూల మార్పు. మరో మాటలో చెప్పాలంటే నూతన ప్రభుత్వం – రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా దాదాపు దశాబ్దకాలంలో కాలగర్భంలో కలిసిన ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు, విలువలకు తిరిగి బీజాలు వేస్తున్నారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. తన రాజకీయ ప్రత్యర్థుల బలానికి తగిన విలువనివ్వాలన్న నిబద్ధతను పాటిస్తూ, నిర్మాణాత్మక విమర్శలను ముఖ్యమంత్రి సాగించడంతో పాటు ప్రతిపక్షాల నుండి కూడా అదే ఆశించడం రాజకీయ పరిణితిని వెల్లడిస్తున్నది.

రాజకీయాలలో వినయం, నిజాయితి, వ్యక్తిగత సంబంధాల మధ్య సున్నితమైన సమతుల్యం పాటించడానికి, పునః నిర్మించడానికి నూతన ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నాడు. ఈ ధోరణి కలుషిత రాజకీయ వాతావరణంలో ఒక మంచి ప్రభావాన్ని చూపుతుంది. ఆచితూచి అధ్యయనంతో అడుగులు ముందుకు పడుతున్నాయి.

మరోవైపు, ప్రజల తీర్పును గౌరవించకుండా ప్రభుత్వాన్ని పడగొడ్తామని, రేవంత్‌రెడ్డిని గద్దె దించుతామని ప్రగల్భాలకు, బెదిరింపులకు పూనుకుంటున్న పక్షాలు ఎంతటి దుర్నీతికి పాల్పడుతున్నాయో అర్థమవుతున్నది. ప్రజాస్వామ్యాన్ని ప్రజల తీర్పును చెరచిన ఈ పక్షాలు ఇంకా గుణపాఠం నేర్చుకోకపోతే కాలగర్భంలో కలవక మానదు.

ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టడంలో ఆరితేరినది ఒక పక్షమైతే, ఎన్నికైన ఇతర పార్టీల ప్రతినిధులను నిస్సిగ్గుగా లోబర్చుకోవడంలో మరోపక్షం దిట్ట. వీటిని అరికట్టాల్సిన తక్షణ కర్తవ్యం ప్రజాస్వామ్య వ్యవస్థది, ప్రజాస్వామిక శక్తులది.

జూన్ 2న నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశమ వార్షికోత్సవాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్న యోచనతో సాగిస్తున్న ఏర్పాట్లతో పాటు రాష్ట్ర అవతరణలో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాత్రను అభినందిస్తూ, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన, విస్మరించిన ఉద్యమకారులందరికీ ప్రత్యేకంగా ఆహ్వానం పంపడం హర్షణీయం.

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన సోనియాగాంధీని దశాబ్ది ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానించడం ద్వారా ఆమె నిర్వహించిన పాత్రకు తగిన గౌరవం ఇచ్చినట్లు అవుతుందని నూతన ప్రభుత్వం, ముఖ్యమంత్రి భావించడం అభినందనీయం.

శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బిఆర్ఎస్ దశాబ్ద పాలనలో తెలంగాణ ఆకాంక్షలు నెరవేరలేదు

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో నేటి నుంచి ఐదు రోజులు వర్షాలు

లోపలి పేజీల్లో...

సంపుటి 26, సంచిక: 343 | ఆదివారం | 02-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## రాష్ట్ర అవతరణ వేడుకలకు

# రాజధాని ముస్తాబు

అత్యంత వైభవంగా దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు సర్కార్ ఏర్పాట్లు

ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సిఎం

సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ వేదికగా ఆదివారం ఉదయం, సాయంత్రం ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు గన్ పార్కులో అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాళులు అర్పించనున్నారు. ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ముఖ్యమంత్రి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు బలగాల పరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్కడే 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర అధికార గీతాన్ని సిఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి, ఉత్తమ శకటాలకు అవార్డులను ప్రదానం చేసి ఫొటో సెషన్‌లో పాల్గొననున్నారు.

**ట్యాంక్‌బండ్‌పై కళాకారులతో కార్నివాల్..**

దశాబ్ది ఉత్సవాలను హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నహాలు పూర్తి చేసింది. ఆదివారం సాయంత్రం ట్యాంక్ బండ్‌పై ఉత్సవాలు నిర్వహించనున్నారు. తెలంగాణ హస్తకళలు, ఉత్పత్తులు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం ఆరున్నరకు సిఎం రేవంత్ రెడ్డి ట్యాంక్‌బండ్‌కు చేరుకొని అక్కడి స్టాళ్లను పరిశీలిస్తారు. సుమారు 700 మంది కళాకారులతో తెలంగాణ కళారూపాల కార్నివాల్‌ను అట్టహాసంగా జరిపేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. 70 నిమిషాల పాటు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు జరపుతారు. ఆ తర్వాత సుమారు 5 వేల మంది జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌పై భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహించేందుకు తరువాయి 7లో

### రాష్ట్ర ప్రజలకు సిఎం శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తయి పదకొండవ సంవత్సరంలో అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఏళ్లకేళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నాయకులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

# ఎన్‌డిఎ వైపు ఎగ్జిట్ ఫలితాలు

**తెలంగాణలో హస్తం, కమలం నువ్వా నేనా!**
**ఎపి అసెంబ్లీలో కూటమిదే అధికారం**



**న్యూఢిల్లీ :** జూన్ 4వ తేదీ నాటి ప్రజాతీర్పు కోసం యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ఏడు దశల్లో జరిగిన ఎన్నికలు ముగిసిన వెంటనే సర్వే సంస్థలు 2024 ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. నేతల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఓట్ల లెక్కింపునకు మరో మూడు రోజులు సమయం ఉన్న వేళ దేశ ప్రజలను ఎగ్జిట్ పోల్స్ పలకరించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో ఎన్‌డిఎదే మరోసారి అధికారం అని దాదాపు అన్ని సర్వే సంస్థలు ఘంటాపథంగా తేల్చిచెప్పాయి. సీట్ల సంఖ్యలో అంచనాలు వేరుగా ఉన్నప్పటికీ మరోసారి ప్రధాని మోదీనే అధికార పగ్గాలు చేపడతారని తేల్చిచెప్పాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసుకుంటే ఎన్‌డీఏ కూటమికి కనిష్ఠంగా 242 సీట్లు, గరిష్ఠంగా 392 సీట్లు వస్తాయని వివిధ సర్వే సంస్థలు అంచనా వేశాయి. సార్వత్రిక సమరంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు 350కు పైగా స్థానాలు వస్తాయని ఇండియా న్యూస్‌డి డైనమిక్స్ సర్వే సంస్థ వెల్లడించింది. బిజెపికి 371కుపైగా స్థానాలు వస్తాయ, కాంగ్రెస్ 125 సీట్లు గెలుస్తుందని ఇతరులకు 47 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. రిపబ్లిక్ భారత్ పీమార్క్ కూడా ఇదే రకమైన అంచనాలను వెలువరించింది. బిజెపికి తరువాయి 7లో

**లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ ఫలితాలు సంస్థల వారీగా**

| | ఎన్‌డిఎ | ఇండియా | ఇతరులు |
|---|---|---|---|
| ఇండియా న్యూస్–డీ డైనమిక్స్ | 371 | 125 | 47 |
| రిపబ్లిక్ భారత్–పీమార్క్ | 359 | 154 | 30 |
| రిపబ్లిక్ భారత్–మ్యాట్రిజ్ | 353–368 | 118–133 | 43–48 |
| జన్‌కీబాత్ | 362–392 | 141–161 | 10–20 |
| న్యూస్ నేషన్ | 342–378 | 153–169 | 21–23 |
| దైనిక్ భాస్కర్ | 281–350 | 145–201 | 33–49 |

# దశాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం లేదు

సిఎం రేవంత్‌రెడ్డికి 22 పేజీలతో కూడిన సుదీర్ఘ బహిరంగలేఖ రాసిన మాజీ సిఎం కెసిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'తెలంగాణ దశాబ్ధి' ఉత్సవాల్లో తాను పాల్గొనడం లేదని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వెల్లడించారు. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పాల్గొనడం లేదన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కెసిఆర్ 22 పేజీలతో కూడిన సుదీర్ఘ బహిరంగ లేఖను శనివారం విడుదల చేశారు. తెలంగాణ ప్రజాపోరాటానికి నాయకత్వ స్థానంలో నిలిచిన తనకు వేదికపైన స్థానం, రాష్ట్ర సాధనలో తనకు ఉన్న అనుభవాలను పంచుకునేందుకు ప్రసంగించే అవకాశం కల్పించకపోవడం 'మీ '(సిఎం) ఆహంకార ఆధిపత్య ధోరణికి పరాకాష్ట అని అన్నారు. తనను ఆహ్వానించినట్టే ఆహ్వానించి, అవమాన పర్చాలన్న దురుద్దేశాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. కేంద్ర మంత్రి, ఎంపి పదవిని తృణ ప్రాయంగా వదిలేసి, ఆమరణ నిరాహారదీక్ష చేసి ఉద్యమాన్ని విజయ తీరం వైపు చేర్చిన తనను, ఆహ్వానించిన తీరు ఎంతో అవమానకరంగా ఉన్నదని కెసిఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతున్నదనే ఆరో పణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కెసిఆర్ పాల్గొనడం సమంజసం కాదని బిఆర్ఎస్‌తో సహా తరువాయి 7లో

## తెలంగాణ సెంటిమెంట్‌తో

# కెసిఆర్ కుటుంబం వ్యాపారం

అమరవీరుల స్థూపంపై బిఆర్ఎస్ దాడి

రాష్ట్ర అవతరణ అంటే కెసిఆర్‌కు గౌరవం లేదు

తెలంగాణ సంస్కృతిని కెసిఆర్ ప్రభుత్వం నాశనం చేస్తే... కాంగ్రెస్ సర్కార్ పునరుద్ధరిస్తున్నది

విలేకరుల ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సంస్కృతిని కెసిఆర్ ప్రభుత్వం నాశనం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతిని పునరుద్ధరిస్తున్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించే విధంగా తెలంగాణ రాష్ట్ర చిహ్నం, గేయం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పునర్ రూపొందిస్తున్నామని సిఎం స్పష్టం చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌ను కెసిఆర్ కుటుంబం వ్యాపారంగా వాడుకున్నదని, అమరవీరుల స్థూపంపై బిఆర్ఎస్ దాడి చేస్తున్నదని, చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే బిఆర్ఎస్ నాయకులకు ఎందుకు అంత బాధ కలుగుతుందో అర్థం కావడంలేదని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతర అంటే కెసిఆర్‌కు గౌరవంలేదని, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి హాజరైన కెసిఆర్ ప్రతిపక్ష నాయకుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. విద్యుత్ సమస్యలపైన బహిరంగ చర్చకు సిద్ధమేనని కెటిఆర్,హరీశ్‌రావులకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కెసిఆర్, హరీశ్‌రావు, కెటిఆర్ ఆరోపిస్తున్నట్టు విద్యుత్ కోతలను విధిస్తున్నారా?,లేదా సాంకేతిక కారణాలతో అంతరాయం ఏర్పడుతుందా? అనే అంశంపై తరువాయి 7లో

### పాకిస్తాన్ తరహా కెసిఆర్ ఒక రోజు ముందే వేడుకలు

భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు కెసిఆర్ రావాల్సి ఉన్నదని, ఆయనకు రాష్ట్ర అవతరణ దినోత్సవంపై గౌరవం లేదని రేవంత్ రెడ్డి తెలిపారు. భారత దేశ స్వాతంత్ర్య అంశంలో పాకిస్తాన్ ఒక రోజు ముందుగానే కెసిఆర్ వేడుకలు నిర్వహించుకుంటున్నారని మండిపడ్డారు. అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానిస్తామంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారన్నారు. వేడుకలకు అందరినీ ఆహ్వానించామన్నారు. అమరుల త్యాగాలు, అమరుల స్థూపం అంటే బిఆర్ఎస్‌కు లెక్క లేదా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నంపైన బిఆర్ఎస్ తన అభిప్రాయాన్ని సబ్ కమిటీకి తెలియ జేయకుండా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయడం ద్వారా వారి అభిప్రాయం అర్థమైందని, ఇంకా వారిని అడిగేదేమున్నదని అన్నారు.




# మారణహోమం ఆపండి

**అమెరికా సామ్రాజ్యవాదం అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు**
**పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాలు నిరసన**

ప్రజాపక్షం/హైదరాబాద్

అమెరికా సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయిల్ గత కొన్ని నెలలుగా పాలస్తీనాలోని గాజా, రఫా ప్రాంతాలపై సాగిస్తున్న దాడులు,మారణహోమాన్ని తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పాలస్తీనా భూభాగంపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ హత్యాకాండను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డు వద్ద సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా' 'ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి, సేవ్ పాలస్తీనా, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, ఇజ్రాయెల్ దాడులను తక్షణమే ఆపాలి' అంటూ వామపక్ష పార్టీల నాయకులు పెద్దఎత్తున నినదించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. పాలస్తీనాపై అమెరికా సామ్రాజ్యవాదం అండతో సాగిస్తున్న దాడులను తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. వేలాది మంది చనిపోతున్నా, లక్షలాది మంది నిరాశ్రయులవుతున్నా ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపడం లేదని, కాల్పులను విరమించాలని ఐక్యరాజ్య సమితి చెప్పినా పట్టించుకోవడం దారుణమన్నారు. ఇజ్రాయిల్‌కు మోదీ ప్రభుత్వం ఆయుధాల సరఫరా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయెల్ చేస్తున్న దుర్మార్గాలు ప్రపంచ మానవాళికి వినాశనంగా మారిందన్నారు. ఆయుధాలను అమ్ముకునేందుకు తరువాయి 7లో

# ముగిసిన సార్వత్రిక సమరం

చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ఏడో దశ ఓటింగ్

చివరి విడతలో 59.15 శాతం పోలింగ్



**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన ఏడో విడత పోలింగ్ బెంగాల్‌లో చెదురుమదురు ఘటనలు, కొన్నిచోట్ల ఇవిఎంలలో సాంకేతిక సమస్యలు మినహా ప్రశాంతంగా జరిగింది. దీంతో 44 రోజులపాటు సుదీర్ఘంగా సాగిన సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. చివరి విడత పోలింగ్‌లో ఏడు రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలోని 57నియోజకవర్గాల్లో ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి 59.15 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయంలోపు కేంద్రాల్లోకి వెళ్లిన వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం పెరగనుంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని 13 లోక్‌సభ స్థానాలతో పాటు ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. హిమాచల్ ప్రదేశ్‌లో 4 లోక్‌సభ స్థానాలతో పాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉపఎన్నిక జరిగింది. పంజాబ్ 13, బెంగాల్ 9, బిహార్ 8, జార్ఖండ్‌లో 3 లోక్‌సభ స్థానాలకు, ఒడిశాలోని 6 లోక్‌సభ, 42 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ముగిసింది. జార్ఖండ్‌లో 67.95 శాతం, యుపిలో 54, పశ్చిమ బెంగాల్‌లో 69.89, బీహార్‌లో 48.86, హిమాచల్‌లో 62.80 శాతం పోలింగ్ నమోదైంది. ప్రధాని మోదీ, అనురాగ్ ఠాకూర్, తరువాయి 7లో

# నాలుగంచెల భద్రత

ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఈ నెల 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని,మొదటగా 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, ఆ తర్వాత ఉదయం 8.30 గంటలకు ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్ రాజ్ వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల లోపు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉన్నదన్నారు. కౌటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అన్ని రకాల ఏర్పాట్లను చేశామన్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల ఓట్ల లెక్కింపు వివరాలను వెల్లడించారు. లోక్‌సభలో ఎన్నికల్లో 3.32 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 కేంద్రాల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలుత ఉదయం 8 గంటలకు పోస్టల బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించారు. ఇందుకు 19 కౌంటింగ్ తరువాయి 7లో



# 295కు పైగా గెలుస్తాం

ఇండియా కూటమి నాయకుల విశ్వాసం

**న్యూఢిల్లీ :** ఇండియా కూటమి 295కు పైగా సీట్లను గెలుపొందుతుందని కూటమి నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో కూటమి నాయకులు శనివారం నాడు రెండున్నర గంటలకు పైగా సమావేశమయ్యారు. ఇందులో ఖర్గేతో పాటు, శరద్‌పవార్ (ఎన్‌సిపి(శరద్ పవార్), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), డి.రాజా (సిపిఐ), సీతారామ్ ఏచూరి(సిపిఐ(ఎం)),దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ(ఎంఎల్)), తేజస్వీ యాదవ్ (ఆర్‌జెడి), అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్ (ఆప్), అనిల్ దేశాయ్ (శివసేన(యుబిటి), చంపై సోరెన్ , కల్పనా సోరెన్ (జెఎంఎం), టి.ఆర్.బాలు(డిఎంకె), ఫరూఖ్ అబ్దుల్లా (ఎన్‌సి),ముఖేశ్ సహానీ (విఐపి) తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఖర్గే మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమాచారం ఆధారంగా తాము గెలుపొందే స్థానాల సంఖ్యపై అంచనాకు వచ్చినట్లు వెల్లడించారు. కూటమి నేతల సమావేశంలో అనేక అంశాలపై తరువాయి 7లో

## వేడుకలకు గవర్నర్‌ను ఆహ్వానించిన సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సిపి రాధాకృష్ణతో సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆయనను ఆహ్వానించారు. దాదాపు 40 నిమిషాల పాటు వారు గవర్నర్తో భేటీ అయ్యారు. అలాగే వేడుకలకు సంబంధించిన వివరాలను సిపి రాధాకృష్ణకు ముఖ్యమంత్రి వివరించారు. ఈ వేడుకలను జూన్ 2న సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ముఖ్య అతిథిగా హాజరు కానున్న విషయం తెలిసిందే.

## కె. శ్రీనివాస్‌రెడ్డికి అమెరికాలో ఘనంగా సత్కారం



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. వాషింగ్టన్ డిసిలో జరిగిన ఒక కార్యక్రమంలో కె.శ్రీనివాసరెడ్డిని వాషింగ్టన్ డిసి అసోసియేషన్ తరుపున ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు విశ్వేశ్వర కలవాలా, శ్రవణ్ పాదూరు,కృష్ణ సైరి, సమరేంద్రా నంది,వెంకట్ దండ,మురళి చల్ల, విష్ణు కడారు, ప్రవీణ్ పాల్ రెడ్డి, మలిశెట్టి రాజమహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షలు నెల రోజులు వాయిదా వేయాలి : ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రూప్1 పరీక్షలు ప్రభుత్వం వెంటనే నెల రోజులు వాయిదా వేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నిరుద్యోగ సంఘాల నాయకులు, నిరుద్యోగులతో కలసి బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జూన్ 9న గ్రూప్1, హెచ్ఏఎల్, ఐబి, పరీక్షలు ఉన్నాయి కాబట్టి గ్రూప్1 వాయిదా వేయాలన్నారు. లేనిపక్షంలో నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఇప్పటికే నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాలన అసమార్థంగా ఉన్నదని, ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు లేక పరిపాలన స్థంభించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు పెంచి నోరిఫికేషన్లు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. గ్రూప్1 ఉద్యోగాలు పెంచి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. పరీక్షలు నెల రోజులు వాయిదా వేయకుంటే ప్రజా ప్రతినిధులను ఎక్కడికక్కడ అడ్డుకుని భరతం పడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఎసి నాయకుడు ఎండీ.అన్వర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, నిరుద్యోగ జెఎసి చైర్మెన్ నీలం వెంకటేష్, బిసి సంక్షేమ సంఘం నేతలు అనంతయ్య, ఎ.సతీష్, పెద్ద ఎత్తున గ్రూప్1 అభ్యర్థులు పాల్గొన్నారు.

## విదేశీ డ్రగ్స్ పట్టివేత..

### 33 గ్రాముల కుష్ మత్తు మందు స్వాధీనం

### ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్



ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్ కంటే అధిక మొత్తంలో మత్తును కలిగిన కుష్ మత్తు మందును సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వీరి నుంచి విదేశాల నుంచి దిగుమతైన రూ.1.32 లక్షల విలువైన 33 గ్రాముల కుష్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. లాలాపేటలో విద్యార్థులకు ఈ కుష్ మత్తు మందు అమ్మకాలు జరుపుతుండగా ఇద్దారిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్దా నుంచి 23 గ్రాములు కుష్ను స్వాధీనం చేసుకున్నారు. కుష్ డ్రగ్స్ అమ్ముతూ మహ్మమద్ఖాన్(అమాన్), మహ్మమద్ మొబిన్లను పట్టుకొని విచారించగా మాకు నిఖిల్ నాయక్ అనే వ్యక్తి అమ్మకాలు జరపాలని ఇచ్చాడని నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు నిఖిల్‌నాయ క్ను పట్టుకున్నారు. ఆతడి వద్దా కూడ 10 గ్రాముల కుష్ లభించింది. ముగ్గురిపై కేసు నమోదా చేసినట్లు సూపరిండెంట్ కే. ప్రదీప్‌రావు తెలిపారు. ఈ కుష్ అనే రకం డ్రగ్స్ గంజాయి కంటే 26 శాతం అధికంగా మత్తునిస్తుంది. ఈ రకమైన మత్తు మందును ఆఫ్రికా, అమెరికా దేశాల్లో సాగు చేస్తారు. ఇండియాలో మాత్రం హిందు పర్వత శ్రేణుల్లో లభిస్తుందాని చెపుతారు. 1 గ్రాము కుష్ డ్రగ్ను రూ. 3500 అమ్మకాలు సాగిస్తున్నట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ డ్రగ్స్ ఎక్కువగా యువతతో పాటు అలవాటు ఉన్న వ్యక్తులు సిగరేట్లలో నింపుకొని తాగుతారు. ఇలా తాగడం వల్ల గంజాయి కంటే ఎక్కువ మత్తు రావడంతో పాటు వాసనకూడ అంతగా రాదాని నిందితులు పెర్కొన్నారు. ఈ మత్తు మందు సముద్రమార్గ ద్వారా బెంగుళూరుకు చేరుతుంది అక్కడి నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

## రూ.3.50 కోట్లతో ఉడాయించిన ఎటిఎం సిబ్బంది

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎటిఎంలో జమ చేయమంటే రూ.3.50 కోట్లతో ఉడాయించిన ఓ ఉద్యోగి ఉదంతం వెలుగు చూసింది. సదరు సంస్థ యాజమాన్యం ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని సెక్యూర్వాల్యూ ఇండియా లిమిటెడ్ (ఎస్‌విఐఎల్) సంస్థ వివిధ బ్యాంకులకు చెందిన ఎటిఎం సెంటర్లలో నగదును జమ చేస్తుంది. ఈ సంస్థలో పని చేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన తాళ్లపల్లి లక్ష్మణ్‌బాబు, భార్గవ్‌లకు ఎల్బీనగర్ లోని 33 ఎటిఎం సెంటర్లలో (రూట్‌నెంబర్ 79) నగదు జమా చేసే బాధ్యతను అప్పగించారు. గత నెల 23వ తేదీన ఎటిఎం సెంటర్లలో నగదు జమ చేసేందుకు వాహనంలో డబ్బు లోడ్ చేసేందుకు వీరిద్దరు సికింద్రాబాద్‌లోని ఎస్‌విఐఎల్ సంస్థ కార్యాలయానికి వచ్చారు. అయితే సర్వర్ సమస్య కారణంలో డబ్బును వాహనంలోకి ఎక్కించలేదు. ఇంతలో రూట్ నెంబర్ 79లోని ఎటిఎం సెంటర్ల ఆడిట్ షెడ్యూల్ వివరాల ఆడిటర్ హెచ్ రాజేష్ సంస్థ మేనేజర్‌కు సమాచారం అందించాడు. ఆ ఆడిట్ రిపోర్టులో ఎస్‌బిఐ బ్యాంకుకు చెందిన రూ. 3,50,43,900 నగదు అపహరణకు గురైందని సంస్థ గుర్తించింది. ఈ విషయం తెలియగానే లక్ష్మణ్‌బాబు అక్కడి నుంచి పారిపోయాడు. అనుమానం వచ్చిన సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సంజీవ్ కమార్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిఆర్ఎస్ దశాబ్ద పాలనలో

# తెలంగాణ ఆకాంక్షలు నెరవేరలేదు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : బిఆర్ఎస్ దశాబ్ద పాలనలో తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేరలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గోదావరిఖనిలో జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్రకమిటీ సమావేశాలకు హాజరైన సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాసిందని, కనిపించకుండా నియంతృత్వ పాలన కొనసాగించిందని, ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్ప చేసిందని అందుకే ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తూ తీర్పు ఇచ్చారని అన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ బుద్ధి తెచ్చుకొని నిర్మాణాత్మకంగా ప్రజలకు దగ్గరై పనిచేయాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు చేయవద్దని, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలు నెరవేర్చాలని అన్నారు. తిరిగి పునర్నిర్మాణం చేసుకోవాలని అన్నారు. గత పాలనలో అన్నిసంస్థలను ఆర్థికంగా కుప్పచేశారని, విద్యుత్తు, ఇరిగేషన్‌తో పాటు సింగరేణిని కూడా నాశనం చేశారని అన్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం దగ్గర డబ్బులేదని ఐనా సర్దుబాటు చేస్తున్నారని అన్నారు. సింగరేణిలో గత సి అండ్ ఎండి శ్రీధర్ వేలకోట్లు దోపిడి చేశారని అందులో పాలకులను కూడా భాగస్వాములను చేశాడని, ఈ కుంభకోణంపై న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరిగేషన్ పేరున మేడిగడ్డ మేలుకంటే కీడు జరిగిందని అన్నారు. తెలంగాణ అధికార గీతం, చిహ్నంపై బిఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తూ ధర్నాలు చేయడం మంచిది కాదని వారి అభిప్రాయాలు చెపితే మంచిదని అన్నారు. అధికారిక చిహ్నంపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని అందరితో చర్చించాకనే నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పాడని అన్నారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ రెండూ బూర్జువా పారిటీలేనని కాంగ్రెస్‌తో కలిసి పనిచేసినంతమాత్రాన ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటామని అన్నారు. రాష్ట్రంలో దేశంలో బిజెపి అత్యంత ప్రమాదకారి అని అందువల్లనే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నామని, రాష్ట్రంలో బిఆర్ఎస్ కూడా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. మోదీ ఎన్నికల్లో ముస్లిం వ్యతిరేకత విద్వేషం రెచ్చగొట్టి హిందూ పేరుమీద గెలువాలని ప్రచారం చేశాడని అన్నారు. కాంగ్రెస్ గెలిచిన చోట సిపిఐ బలమున్నదని భవిష్యత్తులో 25 నుండి 30 స్థానాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి పెడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య, జిల్లా సిపిఐ కార్యదర్శి తాంద్ర సదానందం, నాయకులు కె.కనకరాజు, యూనియన్ నాయకులు ఎల్.ప్రకాశ్, వై.వి.రావు, మడ్డి ఎల్లయ్య, కె.స్వామి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఎఐటియుసిని గెలిపించారని, గత కార్మిక సంఘాలకు భిన్నంగా కార్మికులకు ఎలాంటి డబ్బుల దందాలు లేకుండా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. సమస్యలపై పోరాడుతూ కార్మికులకు మరింత చేరువ కావాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.సీతారామయ్య, రాజకుమార్, అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య, నాయకులుప్రకాశ్, వెంకటస్వామి, వీరభద్రయ్య, వై.వి.రావు, మడ్డి ఎల్లయ్య, ముసికెసమ్మయ్య, తదితరులతో పాటు ఆయా బ్రాంచీలనుండి నాయకులు మాట్లాడారు.

### తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు : కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సిపిఐ శాసన సభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల సాకారమై దశాబ్దకాలం గడవటం సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ ఘట్టాలను, సిపిఐ పాత్రను వివరిస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మొట్టమొదటగా నినదించిన జాతీయ పార్టీ సిపిఐ అని కూనంనేని సాంబ శివ రావు గుర్తు చేశారు. ఆనాడు జాతీయ స్థాయిలో ఎ.బి.బర్దన్, గురుదాస్ దాస్ దాస్ గుప్తా, సురవరం సుధాకర్ రెడ్డి, డాక్టర్ కె.నారాయణ, డి. రాజాలు ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కృషి చేశారని తెలిపారు. అప్పటి యుపిఏ ప్రభుత్వంపై పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు కోసం సిపిఐ ఒత్తిడి తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉద్యమం ఉధ్రుత స్థాయికి చేరుకునేందుకు, పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం, ఆమోదం పొందేందుకు సిపిఐ తీవ్రంగా కృషి చేసిందన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : వారం రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ఈనెల 8 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో డిప్యూటీ సిఎం శనివారం సచివాలయం లో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగిపడడం, స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం లాంటి ఘటనలకు అవకాశం ఉండడంతో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలు, ఉన్నతాధికారుల వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని, తద్వారా ఎవరికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తక్షణమే స్పందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రజలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు అందుబాటులో ఉందని, సరఫరా లోను ఎటువంటి అంతరాయం తలెత్తకుండ చర్యలు చేపట్టాలని అన్నారు. లైన్స్ క్లియరెన్స్ (ఎల్సి) విషయంలోనూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఒకేసారి పలు ప్రాంతాల్లో ఎల్సి ఇవ్వకుండా, ఒక ప్రాంతం తర్వాత మరో ప్రాంతంలో ఇవ్వడంతో పాటు స్థానికంగా ఉన్న వినియోగదారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి మొదలు లైన్ మెన్ వరకు అప్రమత్తంగా ఉండాలి, నిరంతరం సమీక్షలు చేసుకుంటూ సమాచారం చేర వేసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఎ రిజ్వీ, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సిఎండి ముషారఫ్ అలీ, ట్రాన్స్ కో జెఎండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం

### వ్యవసాయ మంత్రితో రైతు సంఘాల ప్రతినిధులు భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని, తాము ఇచ్చిన రైతు భరోసా, రైతు రుణమాఫీ, పంట బీమా పథకాలన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతు సంఘాల ప్రతినిధులకు మరోసారి హామీనిచ్చారు. దీనికి సంబంధించి మ ంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది రూపు ఇవ్వబోతున్నామన్నారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎం.కోదండ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మతో పాటు వివిధ రైతుల సంఘాల నాయకులు టి.సాగర్,కన్నెగంటి రవి,కిరణ్, పా కాల శ్రీహరి, అన్వేష్ రెడ్డి ,నల్లమల వేంకటేశ్వర రావు తదితరులు హైదరాబాద్‌లోని సచివాలయంలోని తుమ్మల ఛాంబర్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ రైతుభరోసా, రుణమాఫీ, పంటల భీమా పథకాలకు సంబంధించి వివిధ రైతు సంఘాలతో జిల్లాల వారీగా చర్చించిన విషయాలను మంత్రికి వివరించారు. డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతుభరోసా, రైతు రుణామాఫీ అమలు చేస్తుందని , ఒక ప్రణాళిక ప్రకారం రైతు శ్రేయస్సుకు అవసరమయ్యే అన్ని పథకాలనూ అమలావుతాయని తెలిపారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఎరువులు, విత్తానాల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను పశ్యపద్మ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. టి. సాగర్, కన్నెగంటి రవి, పాకాల శ్రీహరి, వీస్సాకిరణ్ భూ యజమాన్య హక్కులు, ఆ చట్టాలను సవరించి రైతులు పడుతున్న ఇబ్బందులను దూరం చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్వేష్ రెడ్డి ,నల్లమల వేంకటేశ్వర రావు జీలుగ, పత్తి విత్తనాల లభ్యతపైన దృష్టి సారించాలని మంత్రి తుమ్మలను కోరారు.

**విత్తనాలు పుష్కలంగా ఉన్నాయి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాలు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రైతు సంఘాల ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. విత్తనాల సరఫరాపై రోజు వారిగా సమిక్షిస్తున్నామని, పత్తి విత్తన ప్యాకెట్లు ఇప్పటికే 74,31,016 లక్షల రైతులకు అందుబాటులో ఉంచామని, ఇవి గత ఏడాది శనివారం నాడు సరఫరా చేసిన 58,75,953 ప్యాకెట్ల కంటే 15,55,063 అదనమని తెలిపారు. రైతుల అవసరాల దృష్ట్యా, జిల్లాలకు వారి కోరిక మేరకు ఆయా కంపెనీల విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నామని రైతు ప్రతినిధులకు మంత్రి తుమ్మల వివరించారు.

### గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

## హాల్‌టికెట్లు విడుదల



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీ కోసం ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు టిజిపిఎస్‌పి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. శనివారం గ్రూప్1 హాల్ టికెట్లను విడుదల చేసింది. అభ్యర్థులకు సంస్థ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పరీక్ష షెడ్యూల్ ప్రకారం శనివారం హాల్టికెట్లు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. ప్రిలిమ్స్ పరీక్షను ఒక్కరోజులోనే పూర్తి చేసేందుకు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొంది. 2022లో ఇచ్చిన గ్రూప్1 నోటిఫికేషన్ను రద్దు చేసిన కమిషన్ 563 ఉద్యోగాలతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త ప్రకటనను జారీ చేసింది. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు ఆన్లైన్లో అప్లికేషన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది. పరీక్ష కేంద్రాల గుర్తింపు, భద్రతా ఏర్పాట్లు తదితర బాధ్యతలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో, టెలి కాన్ఫరెన్స్ నిర్వహించింది. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్ష నిర్వహణలో లోపాలతో ప్రిలిమ్స్ రద్దయింది. ఈ నేపథ్యంలో ఈసారి పరీక్షలకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. నిబంధనలు పాటించడంలో అభ్యర్థులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

## మహాసభల వెబ్‌సైట్ ప్రారంభం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ, రెవెన్యూశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మూడవ మహాసభలు ఖమ్మంలో అట్టహాసంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించగా ఆ వెబ్‌సైట్‌ను శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. మహాసభల సందర్భంగా వివిధ మాధ్యమాల్లో సభల విజయవంతానికి సంబంధించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జర్నలిస్టు మహాసభలను పురస్కరించుకుని ఖమ్మంజిల్లాలోని వివిధ నియోజక వర్గ స్థాయిలో పలు కార్యక్రమాలు ని ర్వహించనున్నారు. కొత్తగూడెంలో పెద్ద ఎత్తున ఒక సెమినార్ నిర్వహించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై సెమినార్లు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలన్నింటిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టెకోల రాంనారాయణ, టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, ఖదీర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాసరావు, కనకం సైదులు, జిల్లా నాయకులు నలజాల వెంకట్రావు, భూపాల్, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎస్‌కె మోహినుద్దీన్, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, తాళ్లూరి మురళికృష్ణ, మేడి రమేష్, ఆనంద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### 'గొర్రెల' కుంభకోణంలో

## దోషులను కఠినంగా శిక్షించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్ బాలమల్లేష్

ప్రజాపక్షం/హైదరాబాద్: గొర్రెల పథకం కుంభకోణంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించి లబ్ధిదారులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకం పెద్ద ఎత్తున చేపట్టిందని, అయితే ఈ పథకం అమల్లో నిధులు దారి మళ్ళించడంతో అసలు గొర్రెల విక్రయించిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆర్థిక కుంభకోణానికి తెరలేపారని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల ప్రాంత లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా అంగలూరుకు చెందిన 18 మంది గొర్రెల సరఫరాదారులను సంప్రదించారు. పశు వైద్య శాఖ అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఒక్క యూనిట్కు 1.58 లక్షల చొప్పున కొనుగోలు చేసి అయితే ఇందుకు సంబంధించిన డబ్బులు విక్రయించిన రైతుకు ఇవ్వకుండా అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మకై కుంభకోణాలకు పాల్పడ్డారు. మొత్తం 2.10 కోట్లు గొర్రెల సరఫరా రైతుల పేరిట కాకుండా బినామీల పేరు మీద చెక్కులు మంజూరు చేసి ఆ సొమ్మును కాజేశారని పేర్కొన్నారు. ఇది ఒక ప్రాంతం కాకుండా తెలంగాణ రాష్ట్రంలో అనేక జిల్లాలలో గొర్రెల కాపరులతో డిడిలు కట్టించుకుని వారికి గొర్రెలు అందజేయకుండా అనేక అక్రమాలకు పాల్పడినారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. డిడిలు కట్టిన గొర్రెల కాపరులకు గొర్రెలు అందజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డెలివరీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇండియన్, హెచ్‌పి, భారత్ ఏజెన్సీలలో పని చేస్తున్న గ్యాస్ డెలివరీ వర్కర్లకు గత కొన్నేళ్లుగా కనీస వేతనాలను చెల్లించడం లేదని, వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న గ్యాస్ డెలివరీ వర్కర్ల సమ్మె న్యాయమైన దని, కార్మికులు చాలా కాలంగా శ్రమ దోపిడికి గురవుతూ, ఏ చట్టం పరిధిలోనికి రాలేదని తెలిపారు. కార్మిక శాఖ, సివిల్ సప్లయ్ శాఖ తక్షణమే స్పందించి, డెలివరీ వర్కర్లకు న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు సంప్రదింపుల జరిపి, కార్మికులకు న్యాయం చేయాలని బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తాత్సర్యం చేస్తే రాష్ట్ర వ్యాపితంగా ఎఐటియుసి పోరాటాలకు శ్రీకారం చుడుతుందని ఆయన హెచ్చరిక చేశారు. ఈ సమ్మెకు ఎఐటియుసి రాష్ట్ర సమితి సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ, వారి పోరాటంలో రాష్ట్ర వ్యాపితంగా ఎఐటియుసి శ్రేణులు పాల్గొని, వారికి అండగా నిలబడతామని ఆయన హామీనిచ్చారు. డెలివరీ వర్కర్స్ తమ సొంత వాహనాలలో డీజిల్, మెయింటనెన్స్ ఖర్చులు భరిస్తూ గ్యాస్‌ఏజెన్సీల నుండి ఒక్క రూపాయి వేతనం లేకుండా వినియోగదారుల నుండి కొంత వసూలు చేసుకుని తమ పొట్ట గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలకు రాష్ట్ర అసోసియేషన్లు ఉండగా గ్యాస్ డెలివరీ వర్కర్లకు మాత్రం యూనియన్ ఉండొద్దని వారిపైన కక్షగట్టి కార్మికులను నానా రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను చేరవేసేందుకు గ్యాస్ ఏజెన్సీలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలీండర్‌కు రూ.33.43పైసలను చెల్లిస్తుందని, దీనిని గ్యాస్ ఏజెన్సీదారులే తమ జేబులో వేసుకుంటున్నారని విమర్శించారు. వినియోగదారుల నుండి వసూలు చేసుకోమ్మని కార్మికులను ప్రోత్సహించటం సిగ్గుచేటన్నారు. అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న గ్యాస్ డెలివరీ వర్కర్లకు గ్యాస్ ఏజెన్సీలే వాహనాలను ఇవ్వడంతో పాటు ఇంధనాన్ని కూడా సరఫరా చేయాలని, మెయింటనెన్స్ ఖర్చులను ఏజెన్సీలే భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో నేటి నుంచి ఐదు రోజులు వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : గత కొన్నిరోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఆదివారం నుంచి రాగల 5 రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే ఈనెల 3వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపి తగ్గి వాతావరణం చల్లబడుతుందన్నారు. మే 30న రుతుపవనాలు కేరళను తాకాయని జూన్ 5, 6 తేదీల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. శనివారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, 40 50 కిలోమీటర్ల వేగంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయన్నారు. ఈ నెల 3 నుంచి 5 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్



**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్ :** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే మన ముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా కోశాధికారి, డిపిఆర్ఓ, మహిళ, శిశు శాఖ కార్యాలయాలను ఆకస్మీకంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్‌ని వాడొద్దని, లేని పక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వసతి గృహాలతో పాటు మున్సిపాలిటిలో ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని సూచించారు. ప్లాస్టిక్ నివారణకు ఆయా శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఓ శ్రీనివాస్ రావు, డిపిఆర్ఓ రమేష్ కుమార్, డిడబ్ల్యూఓ వెంకటరమణ, ఏఓ సుదర్శన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయనేత చాడ పరామర్శ



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ఇటీవల కాలంలో అనారోగ్యాలతో మృతి చెందిన దుడ్డెల మల్లికాంబ, జున్నూరి శ్రీనివాస్, మ్యాకల మల్లయ్య కుటుంబాలను శనివారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఈ సంధర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సిపిఐ బలోపేతం కోసం మృతులంతా పనిచేశారని, ఎంతో క్రమశిక్షణతో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వారని, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జరిగిన అనేక ప్రజా సమస్యలపై నిర్వహించిన ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని , అలాంటి కార్యకర్తలు మృతి చెందడం సిపిఐకి తీరని లోటన్నారు. వారి ఆశయాలను , లక్ష్యాలను నెరవేర్చేందుకు నేటి తరం సిపిఐ నాయకత్వం పనిచేయాలని , వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి వారి కుటుంబాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని పటేల్, మాజీ ఎంపిటిసి పరకాల కొండయ్య, సిపిఐ మాజీ గ్రామ కార్యదర్శి తమ్మిశెట్టి రవీందర్, మాజీ ఉప సర్పంచ్ తమ్మిశెట్టి ప్రవీణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విలాసాగరం అంజయ్య తదితరులున్నారు.

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా కమ్యూనిస్టులు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్తాయిగా నిలుస్తారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. శనివారం ఎఐటీయూసి నాయకులు తిర్నాటి సత్యనారాయణ ప్రథమ వర్థంతి సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు సమీపంలో ఎఐటీయూసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థూప ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్‌పాషాతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ సలీం అధ్యక్షతన జరిగిన వర్థంతి సభలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో పనిచేసిన వారు ప్రజల హృదయాల్లో ఎప్పుడూ ఉంటారన్నారు. తిర్నాటి సత్యనారాయణ ఇళ్ల స్థలాల్లో ఉద్యమంలో కీలకమైన వ్యక్తిగా ఉన్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎంతో కృషి చేసిన వ్యక్తి అని కమ్యూనిస్టు పార్టీలో కీలకంగా ఉన్నారన్నారు. ఆయన మన మధ్య లేకపోయినప్పటికి ఆయన పార్టీకి, కార్మికులకు ఎనలేని సేవలందించారన్నారు. అటువంటి నాయకుడిని కోల్పోవటం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు నర్నాటి ప్రసాద్, కృష్ణబాబు, మండల కార్యదర్శి గన్నిన సత్యనారాయణ, చీపుర్ల సత్యవతి, వరలక్ష్మి, ఎఐటీయూసి నాయకులు పఠాన్, అనీల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి పట్టివేత



### 70 కిలోల గంజాయి స్వాధీనం

### పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో భారీగా గంజాయిని పట్టుకున్నారు. వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సరిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగర శివారులోని తీగలవంతెన (కేబుల్ బ్రిడ్జి) వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా స్విఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని ప్రశ్నించారు. వారిచ్చిన సమాధానం స్పష్టంగా లేకపోవడంతో అనుమానం వచ్చి కారును క్షుణ్ణంగా తనిఖీ చేయగా గంజాయి పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 35 ప్యాకెట్లలో 70 కిలోల పొడి గంజాయిని కారు వెనుక సీట్ కింద దాచి ఉంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ గంజాయిని ఒడిశా నుంచి మహారాష్ట్ర తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# యాసంగిలో "ధాన్యాగారం"

### ధాన్యం సేకరణలో రాష్ట్రంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నెంబర్ వన్

### నాలుగోవంతుగా 12.25 వేల మెట్రిక్ టన్నుల సేకరణ

### రాష్ట్రవ్యాప్తంగా 44.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

### ఇబ్బందులను అధిగమిస్తూ అధికార యంత్రాంగం సక్సెస్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ధాన్యం సేకరణలో రాష్ట్రస్థాయిలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 32 జిల్లాలో జరిగిన కొనుగోలు ప్రక్రియంలో నాలుగో వంతు కరీంనగర్ ఉమ్మడి జిల్లా కొనుగోలు చేసి మరోసారి ధాన్యాగార జిల్లాగా పేరుగాంచింది. ఈ యాసంగిలో రికార్డుస్థాయిలో ధాన్యాన్ని అధికారులు సేకరించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాకు గాను ఇప్పటి వరకు రూ. 9819.56 కోట్ల విలువైన 44.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 777814 మంది రైతుల నుంచి సేకరించారు. అందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 7177 కొనుగోలు కేంద్రాలు సైతం తుదిదశకు చేరి మూతబడుతున్నాయి. 96 శాతం కొనుగోళ్లు పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

యాసంగి కొనుగోలు ప్రక్రియ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల్లో విజయవంతంగా ముగిసింది. అకాల వర్షాలతో కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయి ఇబ్బందులు ఎదురైనప్పటికీ చివరిగింజ వరకు కొనుగోలు చేశారు. నాటేసిన ఆరంభంలోనే తెగుళ్ల దాడితో పాటు చివరి వరకు సాగునీరందక గ్రామాల్లో వరి పంట ఎండిపోయి అనుకున్నంత దిగుబడి రాలేదు. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపధ్యంలో ప్రజాప్రతినిధుల ప్రాతినధ్యం లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏప్రిల్ 1న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం రాకను బట్టి అధికారులు, నిర్వాహకులు కొంత ఆలస్యంగా ఏప్రిల్ 12 నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. వాహనాలు, హమాలీలు, గన్నీల కొరత ఉన్నప్పటికీ పక్కా ప్రణాళికతో మిల్లులకు తరలించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షణతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్ ఆర్‌వి కర్ణన్ ఎప్పటికప్పుడు సమీక్షలతో కొనుగోళ్లు వేగవంతం చేస్తూ చెల్లింపులు సైతం వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేశారు. కింది స్థాయి సిబ్బందిని సమన్వయపరుస్తూ వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి దాదాపు 25 సార్లు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ప్రతికూల ఇబ్బందులన్నీ అధిగమిస్తూ అధికార యంత్రాంగం ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది. యాసంగి వరి సాగుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లా అధికారులు లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటూనే కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రయత్నించారు. కొన్ని చోట్ల సరిపడా హమాలీలు లేక, లారీల కొరతతో రైతులు అవస్థలు పడ్డారు. అకాల వర్షాలతో చాలా చోట్ల వడ్లు తడిశాయి. తరుగు పేరిట తూకంలో మోసాలు జరిగాయని అన్నదాతలు ఆరోపించారు. ఈ ఇబ్బందులన్నీ అధిగమించిన అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసింది.

**ముందస్తు ప్రణాళికతో సక్సెస్**

రజనీకాంత్, డిఎం సివిల్ సప్లైస్, కరీంనగర్ జిల్లా.

రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్లాం.. ఏప్రిల్ 12న కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాము.. వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టి లారీలను సమకూర్చి మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాం. కరీంనగర్ జిల్లాలో రూ. 553 కోట్ల విలువైన ధాన్యాన్ని 40436 మంది రైతుల వద్ద కొనుగోలు చేసి చెల్లింపులు దాదాపు పూర్తి చేశాం. 95 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ మూతపడ్డాయి. ఆలస్యంగా ధాన్యం వచ్చిన చోట రెండు మూడు రోజుల్లో మిగిలిన మూతపడనున్నాయి.

| జిల్లా | అంచనా | సెంటర్లు | కొనుగోళ్లు | రైతులు | విలువ (కోట్లలో) |
|---|---|---|---|---|---|
| జగిత్యాల | 588699 | 427 | 409695 | 62199 | 902.56 |
| కరీంనగర్ | 364525 | 341 | 258909 | 41704 | 570.30 |
| పెద్దపల్లి | 312450 | 311 | 303074 | 43837 | 664 |
| రాజన్న సిరిసిల్ల | 312450 | 251 | 253439 | 39455 | 558.32 |

# కబ్జా భూములను వెలికితీస్తా

### మొదటి విడతలో బీదవారిలో అతిబీదవారికి ఇందిరమ్మ ఇండ్లు

### ప్రజలతో శీనన్న కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** నా తమ్ముడు,బావమరిది, నా గెలుపులో అహర్నిషలు కష్టపడిన కార్యకర్తల వద్ద కబ్జాలో ప్రభుత్వ భూములు ఉంటే వాటిని తిరిగి తీసుకుని పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపుతానని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని పలుగ్రామాల్లో ప్రజలతో శీనన్న కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తొలుత నాయుడుపేటలో ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన వేదికల వద్ద మంత్రి మాట్లాడుతూ...ఇందిరమ్మ రాజ్యం రావాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రభుత్వాన్ని ప్రజలు తెచ్చుకునానరని వారందరికి త్వరంలో ఇండ్లు ఇచ్చే బాధ్యత నాదే అన్నారు. మీ కష్టంతో గెలిచి రెండు మంచి పోర్ట్‌పోలియోల్లో ఉన్నానన్నారు. వాటిని ప్రజలకు మంచి చేయడం కోసం వినియోగిస్తానన్నారు. పేదల ప్రభుత్వంలో ప్రజలు కోరిన కోరికల్లో అన్నింటినీ నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేద వారి కళలు కలలుగానే మిగిలాయన్నారు. ప్రభుత్వ స్థలాలు అన్ని బైటకు తీయించి అర్హులన వారికి ఆ స్థలాలు ఇస్తానన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారు ఎంతటివారైన సరే వదిలే ప్రసక్తిలేదన్నారు. గడిచిన పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కోడ్ ముగిసిన వెంటనే రేషన్‌కార్డులు, ఫించన్‌లు ఇస్తామన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ...ఏదులాపురం రెవిన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు, సొసైటీలకు, ట్రస్టులకు ధారదత్తమయ్యాయన్నారు. దీంతో ఇక్కడి ప్రజలకు ఇండ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా తమ ప్రజలకు ఇస్తానన్నా భూములను పట్టా ఇచ్చి నెంబర్ వేయకపోగా మరలి ఇస్తామని రెవిన్యూ అధికారులు తిరిగి తీసుకున్నారన్నారు. ఇంకా భూమి ఉందని దానిని స్వాధీన పరుచుకుని ప్రజలకు ఇండ్లస్థలాలను ఇచ్చి వారి యాదిలో మీరు చిరస్థాయిగా నిలవాలన్నారు. అదేవిధంగా ఏదులాపురం పంచాయతీపరిధిలో ఉన్న సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, యువజనసంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, వేర్‌హౌసింగ్‌గౌడన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటి కన్వీనర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు తమ్మినేని నవీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో అనేక ఇబ్బందులు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు.శనివారం సిపిఐ కార్యాలయం ప్రజాభవన్‌లో సిపిఐ ముఖ్య నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ చిహ్నం జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనాకాలంలో రేషన్‌కార్డులు పంపిణీ జరగలేదని,ఇండ్లు ఇండ్ల స్థలాల సమస్యలు పరిష్కారం కాలేదని, రైతాంగానికి గిట్టుబాటు ధర లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని, నకిలీ విత్తనాలు,పురుగుమందులతో రైతాంగం ఎంతగానో నష్టపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ లోగోను మార్చాలని మాజీ సిఎం కేసీఆర్ చేసిన ఆలోచన మంచిదికాదన్నారు. సమావేశంలో ఆయన వెంట మండల సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సిపిఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమర్రాజు వెంకట్, సిపిఐ సీనియర్ నాయకులు అంబటి భిక్షం, మాజీ సర్పంచ్ ముంత సైదులు పాల్గొన్నారు.

## నాటుసారా నిర్మూలనకు కృషి

ఎస్‌పి రాహుల్ హెగ్డే



**ప్రజాపక్షం/ సూర్యాపేట :** నాటు సారాయిని జిల్లా వ్యాప్తంగా నిర్మూలించేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారాయితో అనేక కుటుంబాలు ఆర్థిక నష్టంతో పాటు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయని చెప్పారు. జిల్లాలో నాటుసారాయి మూలాలను నిర్మించాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. సారాయిని తయారు చేసే గ్రామాలు, తండాలు, వ్యక్తులను గుర్తించి హాట్ స్పాట్స్‌ను గుర్తించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి ముడిసరకులైన బెల్లం, పట్టిక ఎక్కడ నుండి వస్తుందో గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అలవాటుగా నేరాలకు పాల్పడే వారిపై పిడియాక్ట్ కేసు నమోదు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ రెడ్డి, సూర్యాపేట జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్, డిఎస్‌పిలు రవి, శ్రీధర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్ స్పెక్టర్ వీరరాఘవులు, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన

**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ,నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్లో ఎంఎల్‌సి ఎన్నికలు జరిగిన 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఏఆర్ఓలకు ఓట్ల లెక్కింపు పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండు చాలా ముఖ్యమని, ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీయడం, అలాగే అవసరమైన మెటీరియల్ అన్నిటిని ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ప్రక్రియను ఏజెంట్లకు, అభ్యర్థులకు చూపించి వారి ఎదురుగానే నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు ఎలాంటి ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, సెల్ ఫోన్ వంటివి తీసుకురావడానికి వీలులేదని అన్నారు. డేటా ఎంట్రీ పై సైతం అధికారులు దృష్టి సారించాలని, ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా దుప్పలపల్లి గోదాంలో 4 హాళ్లలో ఓట్ల లెక్కింపును చేపట్టడం జరుగుతున్నదని, ఇందుకుగాను 96 లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కోహాల్లో 24 లు ఉంటాయని తెలిపారు .ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరూ లెక్కింపు కేంద్రం వద్ద హాజరు కావాలని ,ఉదయం 8 గంటలకు కచ్చితంగా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. మొదటి రౌండు షిఫ్ట్ డ్యూటీలో ఉన్నవారు రెండవ స్విఫ్ట్ ఉద్యోగులు వచ్చిన తర్వాతే బయటకు వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు .ఈ సందర్భంగా టాబులేషన్,ఓట్ల లెక్కింపు ,రిపోర్టులు,మొదటి రౌండు కౌంటింగ్ అంశాలపై మాట్లాడారు. మూడు రౌండ్ల వరకు పూర్తిస్థాయిలో బండిల్స్ లెక్కించడం జరుగుతుందని, నాలుగవ రౌండ్ సైతం ఉంటుందని అంచనా వేస్తున్నామని, పోస్టల్ బ్యాలెట్ అన్నింటిని కలుపుకొని బ్యాలెట్ పేపర్ లెక్కించవలసి ఉంటుందని, చెల్లుబాటు ఓట్లు , చెల్లుబాటు కానీ ఓట్లను జాగ్రత్తగా లెక్కించాలని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.


BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 365 OF 2024

Between:-

**M/s.Kalpakam Chit Funds Pvt Ltd., Hanamkonda Branch**, rep. By it's Foremen,

... Disputant

VERSUS

**SAYYED AKTHAR & OTHERS**

... Opponents

3. Maloth Narsinga Rao, S/o, Shankaraiah, Age: 50 Yrs, Occu: S.R(Tech), R/o: H.No: 2-31, 2'd Ghanpur, Janagaon.
4. Royyala Satyanarayana, S/o, Gouraiah, Age: 56 Yrs, Occu: Craft Teacher, T.S.W.R., Junior College, R/o: H.No: 31-3-2250, NGO'S Colony, Waddepally, Hanamkonda.
5. Gondi Venugopal, S/o, Laxmanrao, Age: 49 Yrs, Occu: Superintendent, R/o: H.No: 1-173/1, Pasra, Govindharaopet, Mulugu.
6. Kokkisa Subash, S/o, Sudharshan, Age: 48 Yrs, Occu: Head Warder At Subjail, R/o: H.No: 2-38, Siddapur, Hasanparthy, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL

ABR. NO. 53 OF 2024

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., HANAMKONDA Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

....Disputant

VERSUS

**S.SRIRAM REDDY & OTHERS.**

...Opponents

1. Sunkari Sriram Reddy S/O Buchi Reddy Aged About 30 Years Occ: Business. R/O- H.No. 1-100. Bothalapally, Huzurabad, Karimnagar.
2. Teegala Sathish Kumar S/O Ilaiah Aged About 38 Years Occ: Business. R/O. H.No. 1-85, Keshvapur, Elkathurthy, Warangal.
3. Teegala Kirnmai W/O Pradeepkumar Aged About 29 Years Occ:Business. R/O. H.No. 35-3-21/1/D/104, Gopalpur, Hanamkonda.
5. Azmeera Ramesh S/O Pathilal Aged About 34 Years Occ:Business. R/O. H.No. 3-72, Bairnpalli, Hasanparthy, Siddapoor, Warangal

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 55 OF 2024

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., HANAMKONDA Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

.....Disputant

VERSUS

**B.SARANGAPANI & OTHERS**

......Opponents

1. Bandi Sarangapani S/O Vasantha Rao Aged About 44 Years Occ: Business. R/O. H.No. 1-7-354/1/1, Revenue Colony, Hanamkonda.
2. Gampa Saraladevi W/O Nagaraju Aged About 59 Years Occ:Asst.Registrar University college of Law.R/O. H.No.1-5-181, Main Road, kazipet, Hanamkonda.
4. Bollepaka Prabhaker S/O Pochaiah Aged About 55 Years Occ:Superintendent Education KU. R/O. H.No.1-1-374/202, Prashanthnagar, Kazipet, Hanamkonda.
5. Pulla Susheel S/O Sanjeeva Rao Aged About 39 Years Occ:Plant Collector/Univ. Arts & Science College. R/O. H.No. 2-1-1131. Naimnagar, Hanmkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL

ABR. NO. 57 OF 2024

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd.,HANAMKONDA Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

.....Disputant

VERSUS

**P.SHARTHACHANDRA REDDY & OTHERS**

......Opponents

1. Pogalla Sharath Occ:BDM/Boot Homes, Floor, Road Nagar. Ranga Reddy. Chandra Reddy S/O Mohan Reddy Aged About 49 Years Technology Service Hyd-bad. R/O. H.No.C2, III Maple No.4. Alkpur Towenship. Necknapur, Puppalgutta, Rajendra
3. Yellu Anuradha D/O Ramachandra Reddy Aged About 50 Years Occ: Teacher/ CPS/ Manikonda. R/O. H.No. 3-72/1/133, Anjali Gardens, Puppalaguda, Manikonda, Hyd-bad.
4. Yellu Bala Gangadhar Reddy S/O Ramachandra Reddy Aged About 58 Years Occ:Jr. Engineer/ BSNLR/O. H.No. 4-3-74,521/46, F-2, Type-III BSNL Staff Qtrs, Kandaswamy Lane, Sulthanabazar, Hyd-bad.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 314 OF 2023

Between:-

**M/s. SARVAKSHA Chit Funds Pvt Ltd., Warangal Branch,** rep. By it's Foremen,

...Disputant

VERSUS

**K.SHIVAKAR & OTHERS**

...Opponents

2. Anugu Purna Chander, S/o, Keshavulu, Age: 39 Years, Occu: Sr. Asst. R/o: H.No: 2-1-634, Vidyaranyapuri, Hanumakonda.
3. Pendli Ashok, S/o, Ilaiah, Age: 44 Years, Occu: Jr. Asst, R/o: H.No: 25-4-393. Vishnupuri Colony, Kazipet, Hanumakonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL

ABR. NO. 364 OF 2024

Between:-

**M/s.Kalpakam Chit Funds Pvt Ltd., Hanamkonda Branch,** rep. By it's Foremen,

... Disputant

VERSUS

**T.THIRUPATHI & OTHERS**

... Opponents

5. Konde Mahender, S/o, Mallaiah, Age: 47 Yrs, Occu: Vetarnary Asst., R/o: H.No: T1/460, 8 incline Colony, Hanumannagar, Godavarikhani, Peddapally.
6. Nimmala Rajagopal, S/o, Ashok Rao, Age: 32 Yrs, Occu: Business, R/o: H.No: 35- 3-1379, Gopalpur, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **14.06.2024** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

## మారణహోమం ఆపండి

(3వ పేజీ తరువాయి)

అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల మధ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతున్నదన్నారు. పాలస్తీనాకు ప్రపంచ ప్రజలంతా అండగా ఉండాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడాలని ఆయన కోరారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రజాస్వామ్య విరుద్ధమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు హన్మేష్ అన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించడం. ఆ జాతి లేకుండా చేయడం కోసమే ఇజ్రాయెల్ మారణకాండకు పాల్పడుతున్నదన్నారు. 37 వేల మందిని చంపిందనీ, పిల్లలు నిద్రలోనే మరణిస్తున్నారని, ఇజ్రాయిల్ మానవత్వం లేకుండా వ్యవహరించడం సరైంది కాదన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేసి శ్మశానంగా మారుస్తున్నదని విమర్శించారు, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె గోవర్ధన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం లౌకికవిధానం నుంచి వైదొలగి ఇజ్రాయిల్‌కు సహకారం అందించడం దుర్మార్గమన్నారు. పాలస్తీనాలో ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగాలని డిమాండ్ చేశారు. ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర నాయకులు తేజ మాట్లాడుతూ పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడి ప్రపంచ మానవాళి మీద జరుగుతున్న దాడిఅని, దీనిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు అధ్యక్షత వహించగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి. సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఎం శ్రీనివాస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సూర్యం, ఎస్‌ఎల్ పద్మ,సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 295కు పైగా గెలుస్తాం

(3వ పేజీ తరువాయి)

చర్చించామని, ముఖ్యంగా జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా మాట్లాడినట్లు తెలిపారు. కూటమి కార్యకర్తలు కౌంటింగ్ ముగిసేంత వరకు కౌంటింగ్ హాల్‌ను విడిచిపెట్టి వెళ్ళవద్దని సూచించామని చెప్పారు. అలాగే ఫామ్ 17 సిలో పోలైన ఓట్ల సంఖ్యతో లెక్కించిన ఓట్లను సరి పోల్చుకోవాలని, కౌంటి పైర్తయి, విజేతకు ఎలక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేంత వరకు కూటమి కార్యకర్తలు కౌంటింగ్ హాల్ నుండి బైటికి రావొద్దని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ తుది దశ పోలింగ్ జరుగుతున్న రోజు మధ్యాహ్నం ఖర్గే నివాసంలో జరిగిన ఇండియా కూటమి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇండియాకు 295 స్థానాలు వస్తాయని, దీనిపై అందరు నాయకులతో మాట్లాడిన తరువాత నిర్ధారణకు వచ్చామని తెలిపారు. ఇది ప్రజల సర్వే అని, ప్రజలే ఈ సమాచారాన్ని కూటమి నాయకులకు తెలియజేశారని అన్నారు. ప్రభుత్వ సర్వేలు ఉండనే ఉన్నాయని, వాటిని తమ మీడియా మిత్రుల ద్వారా సంఖ్యను ఎక్కువ చేసి చూపిస్తారని అన్నారు. అందుకే తాము వాస్తవాలను తెలియజేస్తున్నామన్నారు. ఎగ్జిట్ పోల్స్ ద్వారా ఒక వృత్తాంతాన్ని సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, తాము మాత్రం ప్రజలకు వాస్తవాలు చెప్పాలనుకుంటున్నామన్నారు. తమ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నందున భేటీకి వెళ్లడం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముందుగానే ప్రకటించారు.

## ఉత్సవాలలో పాల్గొనడం లేదు

(3వ పేజీ తరువాయి)

ఉద్యమకారులు, తెలంగాణ వాదుల అభిప్రాయమన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న వికృత పోకడలను నిరసిస్తూ ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బిఆర్‌ఎస్ పాల్గొనడం లేదని, ఇందుకు తాను విచారిస్తున్నామన్నారు. తెలంగాణరాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితమని, అమరుల త్యాగాల పర్యవసానమన్నారు. కాంగ్రెస్ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ భావ దారిద్ర్యాన్ని నిరసిస్తున్నామని,ఇకనైనా వైఖరిని మార్చుకుని సంక్షేమానికి పాటుపడాలని కెసిఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇక నుంచైనా నిజమైన ప్రగతి, సంక్షేమం కోసం ప్రయత్నిస్తారని, ఎన్నికల వాగ్దానాలన్నీ త్వరగానే నెరవేరుస్తారని ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నట్టు కెసిఆర్ తెలిపారు. తెలంగాణకు గర్వకారణమైన అస్తిత్వ చిహ్నాలపై విషం కక్కుతూ అధికార ముద్ర నుంచి తొలగిస్తామని అవమానిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాల నిర్వహణపై అఖిలపక్ష సమావేశానికి బిఆర్‌ఎస్‌ను ఆహ్వానించకపోవడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని కెసిఆర్ అ న్నారు.

## నాలుగంచెల భద్రత

(3వ పేజీ తరువాయి)

కేంద్రాలలో 276 ఏర్పాటు చేశారు. 135 స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు సిఇఒ వికాస్ రాజ్ వెల్లడించారు. సర్వీసు ఓటర్ల కోసం కేటాయించిన ఇటిపిబి ఓట్ల లెక్కింపు కూడా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రంలోనే నిర్వహించనున్నారు. ఇందుకు వేరుగా టేరుగా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందని, కౌంటింగ్ కేంద్రాల వద్ద 12 కేంద్ర బలగాలతో బందోబస్తు ఉంటుందని, కౌంటింగ్ కేంద్రం మొత్తం సిసిటివి మానిటరింగ్ చేస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా తీసుకెళ్లేందుకు అనుమతి లేదని వికాస్ రాజ్ తెలిపారు. 17 నియోజక వర్గాలలో ఒక్కో పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా హాల్‌ను ఏర్పాటు చేశామని, మల్కాజిగిరి లో అదనపు హాల్‌ను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ప్రతీ రౌండ్‌కు సిబ్బందితో పాటు అబ్జర్వర్లు కూడా ఇవిఎం కౌంటింగ్ చేస్తారని, కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను స్టోరేజ్ రూమ్‌లకు భారీ బందోబస్తు నడుమ తరలిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు అనుమతి లేనిదే ఎవ్వరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున మద్యం దుకాణాలు బంద్ ఉంటాయని, అలాగే ర్యాలీలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ర్యాలీలకు పోలీసులు అనుమతినిస్తే నిర్వహించుకోవచ్చని వికాస్ రాజ్ అన్నారు.

**అత్యధికంగా 24 రౌండ్లు...అత్యల్పంగా 13 రౌండ్ల లెక్కింపు**

చొప్పదండి, యాకత్ పుర, దేవరకొండలో అత్యధికంగా 24 రౌండ్లు,అలాగే ఆర్మూర్, భద్రాచలం, అశ్వరావు పేటలో అత్యల్పంగా 13 రౌండ్లు ఓట్ల లెక్కింపు ఉంటుందని వికాస్ రాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపులో దాదాపు 10 వేల మంది సిబ్బంది పాల్గొంటారని, మరో 50 శాతం మందిని అదనపు సిబ్బందిని అందుబాటులో పెట్టామన్నారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ర్యాండమ్‌గా కేటాయిస్తామని, లెక్కింపు రోజున ఉదయం 5 గంటలకు ర్యాండమ్‌గా సిబ్బందిని కేటాయిస్తామని వికాస్ రాజ్ తెలిపారు. 2400కుపైగా మైక్రో అబ్జర్వర్లు ఉంటారన్నారు.

**''వివి ప్యాట్ ''స్లిప్పులకు ప్రత్యేక క్యాబిన్**

వివి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రత్యేక క్యాబిన్‌ను ఏర్పాటు చేసింది. కౌంటింగ్ పూర్తయిన ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 పోలింగ్ కేంద్రాల్లో వివి ప్యాట్ల లెక్కిస్తారు. ఫలితాలను ప్రకటించడం కోసం బోర్డులను అందుబాటులో ఉంచారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతో పాటు బారికేడ్లను కూడా ఏర్పాటు చేశారు.

**మహబూబన్‌నగర్‌లోనే ఎంఎల్‌సి కౌంటింగ్**

జూన్ 5న 'నల్లగొండ,వరంగల్,ఖమ్మం' ఎంఎల్‌సి ఓట్ల లెక్కింపు

మహబూబ్ నగర్ ఎంఎల్‌సి కౌంటింగ్ జూన్ 2న జరుగుతుందని సిఇఒ వికాస్ రాజ్ వెల్లడించారు. ఈ కౌంటింగ్ మహబూబ్ నగర్‌లోనే ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. నల్గొండవరంగల్‌ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ జూన్ 5న ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. కౌంటింగ్ నిమిత్తం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 24 కౌంటింగ్ జరుగుతుందని వివరించారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓట్ల శాతం తగ్గినప్పటికీ దక్షిణాఫ్రికాలో ఎఎన్‌సిదే పైచేయి?



ఎఎన్‌సి చీఫ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోస



**కేప్‌టౌన్:** ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) ఈసారి కూడా దక్షిణాఫ్రికా సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తున్నది. అయితే, గత 30 సంవత్సరాల్లో ఎన్నడూ లేని రీతిలో ఓట్ల శాతం 50 కంటే తగ్గింది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఎఎన్‌సికి 40.25 శాతం ఓట్లు లభించగా, డెమోక్రాటిక్ అలియన్స్ (డిఎ) 21.7 శాతం ఓట్లను కైవసం చేసుకుంది. జాకబ్ జుమా నేతృత్వంలోని ఎంకె పార్టీ 14.65 శాతం, ఇఎఫ్‌ఎఫ్ 9.47 శాతం చొప్పున ఓట్లు సంపాదించాయి. ఎక్కువ శాతం ఓట్ల లెక్కింపు ఇప్పటికే పూర్తికాగా, ఈ ఓట్ల శాతంలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. మూడు దశాబ్దాల కాలంలో మొదటిసారి 50 శాతం కంటే తక్కువ శాతం ఓట్లు రావడంతో, ఎఎన్‌సి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. అయితే, ఇతర పార్టీని లేదా పార్టీలను చేర్చుకొని, సంకీర్ణ ప్రభుత్వానికి అంగీకరించక తప్పదు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు జరుగుతుండగా, ఈనెల 2వ తేదీ, ఆదివారం ఫలితాలు వెలువడే అవకాశాలు ఉన్నాయి. అయితే, చట్టబద్ధంగా ఫలితాలు వెల్లడించడానికి 5వ తేదీ వరకూ సమయం ఉంది. కాగా, దివంగత నెల్సన్ మండేలా హయాంలో, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి నాయకత్వం వహించిన ఎఎన్‌సిపై ఇటీవల కాలంలో విమర్శలు పెరుగుతున్నాయి. ప్రజల్లో ఆ పార్టీ పట్ల అసహనం వ్యక్తమవుతున్నది. మండేలాపై ఉన్న గౌరవంతో ఎఎన్‌సికి ఓట్లు పడతాయని విశ్లేషకులు అంటున్నప్పటికీ, ఓట్ల శాతం మాత్రం తగ్గుతుందని అంగీరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మొత్తం మీద, ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే ఎక్కువే నమోదైంది. బుధవారం దేశవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల వెలుపల చాలా మంది ఓటర్లు అర్ధరాత్రి వరకు వేచి ఉండడం కనిపించింది. చారిత్రాత్మక 1994 ఎన్నికల తర్వాత, ఈ రీతిలో ప్రజలు పోలింగ్ బూత్‌లకు తరలిరావడం ఇదే మొదటిసారి. సిరిల్ రమాఫోసా నేతృత్వంలోని ఎఎన్‌సి ఈ ఎఇన్నకల్లో గెలిచే అవకాశాలు ఉన్నప్పటికీ, ఓట్ల శాతం తగ్గడం ఆ పార్టీని ఒత్తిడికి గురి చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పెరుగుతున్న నిరుద్యోగం ఎఎన్‌సిపై ప్రజల వ్యతిరేకతకు ప్రధాన కారణం. గత ఏడాది నిరుద్యోగిత, గతంలో ఎన్నడూ లేని విధంగా 32 శాతానికి చేరింది. ఆర్థిక అసమానతలు, అవినీతి ఆరోపణలు, తరచుగా విద్యుత్ కోతలు ఎఎన్‌సి సర్కారుపై ప్రజల అసంతృప్తికి కారణాలు. దేశంలో హింసాత్మక నేరాలు పెరిగాయి. 2023 చివరి మూడు నెలల్లో రోజుకు సగటున 130 అత్యాచారాలుఐ 80 హత్యలు అధికారులపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎఎన్‌సి చెప్పినప్పటికీ, ప్రజలు విశ్వసించడం లేదన్న వాదన వినిపిస్తున్నది. రాబోయే ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తామని, పెట్టుబడులను పెంచేందుకు, ప్రైవేట్ రంగానికి మద్దతునిచ్చి అవినీతిని అంతం చేస్తామని ఎఎన్‌సి ఇచ్చిన హామీ ఎంత వరకూ ఓట్లను రాబడుతుందో చూడాలి.

ప్రపంచం

## మైయన్మార్ నేత టిన్ ఊ కన్నుమూత



**బ్యాంకాక్:** కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ, చికిత్స పొందుతున్న మయన్మార్ ప్రజానేత, నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్‌ఎల్‌డి) సహవ్యవస్థాపకుడు టిన్ ఊ శనివారం తుదిశ్వాస విడిచారు. 97 సంవత్సరాల టిన్ ఊ మృతికి సంబంధించిన నివేదిక ఇంకా వెల్లడి కాలేదు. ఫిలిప్పీన్స్ అగ్రనేత, మయన్మార్ మాజీ అధ్యక్షురాలు అంగ్‌సాన్ సూకీ సహచరుడిగా, ఆమెతో కలిసి ప్రజా ఉద్యమంలో పాల్గొన్న యోధుడిగా, ఎన్‌ఎల్‌డి సహవ్యవస్థాపకుడిగా ఆయనకు మంచి పేరు ఉంది. 1988లో ఎన్‌ఎల్‌డి ఏర్పాటు చేసిన తర్వాత, ఆ పార్టీకి తొలుత వైస్ చైర్మన్‌గానూ, ఆ తర్వాత చైర్మన్‌గానూ సేవలు అందించారు. సూకీతో కలిసి, సైనిక జుంటా ప్రభుత్వానికి వ్యతిరేంగా పోరాటం సాగించి, సూకీతో కలిసి నిర్బంధానికి గురయ్యారు. 14 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన ఆయనను సైనిక సర్కారు చాలాకాలం గృహ నిర్బంధంలో ఉంచింది. సూకీతోపాటు 2010లో జైలు నుంచి విడుదలైన టిన్ ఊ మైయన్మార్ అంతటా విస్తృతంగా పర్యటించారు. సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టారు. అదే సమయంలో ఆయన తీవ్రమైన నిర్బంధాలు ఎదుర్కొన్నారు. జైలు, గృహ నిర్బంధం ఆయన జీవితంలో భాగమయ్యాయి. 2015 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌ఎల్‌డి తిరుగులేని విజయాన్ని సాధించడంలో సూకీతోపాటు టిన్ ఊ కూడా కీలక పాత్ర పోషించారు. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగలేదు. వివిధ నేరారోపణలపై సూకీని 2021లో జైల్లోకి నెట్టిన సైన్యం, పాలనను మరోసారి తన చేతుల్లోకి తీసుకుంది. 2022 ఎన్నికల్లో సూకీ నేతృత్వంలోని ఎన్‌ఎల్‌డి మరోసారి గెలిచినప్పటికీ, సైన్యం ఆమెను జైల్లో పెట్టింది. ఆ సమయంలో టిన్ ఊ దేశాధ్యక్షుడు అవుతాడని అంతా ఊహించారు. కానీ, సూకీని తమ నేతగా పేర్కొన్న ఆయన, మయన్మార్ అధ్యక్ష పదవిని స్వీకరించలేదు. అనంతరం సూకీ ప్రభుత్వాన్ని సైన్యం రద్దు చేసింది. మరోసారి జుంటా ప్రభుత్వం ఏర్పడింది. టిన్ ఊపై నిర్బంధాలు కొనసాగాయి. కొంతకాలంగా, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ టిన్ ఊ మృతి చెందినట్టు ఆయన కుటుంబీకులు ప్రకటించారు.

## రాజీపై ఇజ్రాయెల్ మొండిపట్టు




**టెల్‌అవీవ్:** హమాస్‌తో రాజీ ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇజ్రాయెల్ సుముఖత వ్యక్తం చేయడం లేదు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించేందుకు ప్రయత్నించాలన్న ఆయా కుటుంబాలు చేస్తున్న విజ్ఞప్తిని కూడా పట్టించుకోవడం లేదు. కాల్పుల విరమణపై స్పష్టత ఇవ్వడం లేదు. గాజా స్ట్రిప్‌పై దాడులు కొనసాగిస్తునే ఉంది. భారీగా ఆస్తి, ప్రాణ నష్టాలు తప్పడం లేదు. గాజా స్ట్రిప్‌లోని పలు ప్రాంతాలు, ముఖ్యంగా రఫా వంటి నగరాలు బాగా దెబ్బతిన్నాయి. గాజాలోని లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కొంత మంది ఇతర ప్రాంతాలకు పారిపోగా, మరికొంత మంది సహాయక శిబిరాలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లో తల దాచుకుంటున్నారు. వారికి మానవతా సాయాన్ని అందించేందుకు వివిధ దేశాలు ముందుకు వస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ దళాలు దాదాపు అన్ని మార్గాలను మూసివేయడంతో, రఫాతోపాటు గాజా స్ట్రిప్‌లోని అనేక ప్రాంతాల్లో ఆకలి కేకలు పెక్కుటిల్లుతున్నాయి. ఇలావుంటే, వెంటనే కాల్పుల విరమణను అమలు చేయాలని ఇజ్రాయెల్‌ను అమెరికా కోరింది. మూడు దశల్లో శాంతి స్థాపనకు మార్గదర్శకాలను జో బైడెన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ, ఇజ్రాయెల్ అందుకు సుముఖతను వ్యక్తం చేయడం లేదు. ఒకదాని తర్వాత మరొకటిగా షరతులు విధిస్తూ, కాల్పుల విరమణ ఒప్పందాలను తుంగలో తొక్కుతున్నది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు వ్యవహార శైలిని హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారి కుటుంబీకులు, సన్నిహితులు తప్పుపడుతున్నారు. హమాస్ బందీలుగా పట్టుకున్న వారిలో కనీసం 30 మంది మృతి చెందగా, వంద మంది వరకూ ఇప్పటికీ విడుదల కాలేదు. విడతల వారీగా కొంత మంది హమాస్ చెర నుంచి బయటపడినప్పటికీ, ఇంకా అక్కడే బందీలుగా ఉన్న వారి పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అమెరికాసహా పలు ప్రపంచ దేశాలు కాల్పుల విరమణతోపాటు, సంధికి డిమాండ్ చేస్తున్న తరుణంలో, ఇజ్రాయెల్ సానుకూలంగా స్పందించాలని బాధిత కటుంబాల వారు కోరుతున్నారు. ప్రస్తుత యుద్ధంలో అమాయకులైన ప్రజలు బలవుతున్నారని వారు వాపోతున్నారు. వెంటనే స్పందించకపోతే, పరిస్థితి చేజారిపోతుందని భయపడుతున్నారు. కానీ, ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను కూడా నెతన్యాసు పట్టించుకోకపోవడం విచిత్రం. మొండిపట్టును వీడకపోవడం దుర్మార్గం. ఎంత త్వరగా ఇజ్రాయెల్ రాజీ ప్రస్తావనకు అంగీకరిస్తే అంత మంచిది.

# కెసిఆర్ కుటుంబం వ్యాపారం

(3వ పేజీ తరువాయి)

లాక్‌బుక్‌లతో సహా అన్నింటిపై ఫోరెన్సిక్ నిపుణులతో చర్చిద్దామన్నారు. హైదరాబాద్ జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డి శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం, తాను సిఎంగా ఉండడం తన జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకాలని ఆయన అన్నారు. రైతు భరోసాను ఎవరికి ఇవ్వాలి, ఎవరికి ఇవ్వకూడదనే అంశంపై అసెంబ్లీలో చర్చిస్తామని, పేద వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని సిఎం అభిప్రాయపడ్డారు. ఉద్యోగులకు బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేసే అంశంలో ముందుగా సిఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సచివాలయ అధికారులకు బయో మెట్రిక్‌ను అమలు చేసిన తర్వాత ఉద్యోగులందరికీ బయో మెట్రిక్ హాజరును అమలు చేసే అం శాన్ని ఆలోచిస్తామని చెప్పారు. రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని,రైతులు ఒకే బ్రాండ్‌ను కోరుతున్నారని,ఎరువులు, విత్తనాలు డిమాండ్‌పై 10 శాతం అధికంగా తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సోనియా గాంధీని ఆహ్వానించామని,ఆమె ఆరోగ్యం బాగుంటే వస్తారని తెలిపారు. సచివాలయం లోపలనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

**ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌కు 'తెలంగాణ తల్లి విగ్రహం' బాధ్యత**

తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన బాధ్యతలను ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌కు అప్పగించినట్టు సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికే టిఎస్‌ను, టిజిగా మార్చుకున్నామని, ఆదివారం తెలంగాణ రాష్ట్రీయ గీతంను విడుదల చేస్తామన్నారు. త్వరలో తెలంగాణ తల్లి,చిహ్నం విడుదల చేస్తామని వెల్లడించారు.అమరవీరులను గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి, వారి కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ప్రాంగణం లోపల ఏర్పాటు చేస్తామని సిఎం చెప్పారు. రూ.1000 కోట్లతో అమరవీరుల స్థూపం కట్టాలని గతంలోనే తాను డిమాండ్ చేసిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు.

**కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం**

**రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 9 నుంచి 13 ఎంపి స్థానాలు**

ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ కేంద్రంలోనూ 'ఇండియా కూటమి' ప్రభుత్వం ఏర్పడు తుందని,తెలంగాణ రాష్ట్రానికి నాలుగు కేంద్రమంత్రి పదవులను అడుగుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 9 నుండి 13 ఎంపి సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు ఎంఎల్‌సిలు, ఒక ఎంఎల్‌ఎ స్థానాల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనుకున్న ఫలితాలు రాకపోతే ఇక నుండి మరో రెండు గంటలు ఎక్కువ పని చేస్తానని వ్యాఖ్యానించారు.

**పిసిసిపై ఎఐసిసి నిర్ణయమే ఫైనల్**

సమ్మక్క, సారలమ్మ,జంపన్నలను చంపిన రాజులుగానే తాను కాకతీయులను చూస్తానని అన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం విషయంలో ఏదున్నా అందెశ్రీ చెప్పాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని, స్థానిక నాయకులు,కింది స్థాయి అధికారులను పట్టుకొని హరీష్ రావు చిల్లర డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వం వద్ద అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం,మేడిగడ్డ అంశంపై ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫోన్ టాపింగ్‌పై కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు.

**విద్య,క్రీడలను ప్రోత్సహిస్తాం**

రాష్ట్రంలో విద్య, క్రీడలను ప్రోత్సహించాలని భావిస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. బిసికుల గణన చేసేందుకు ఆర్డర్ చేశామని, త్వరలోనే కులగనణ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుట్ బాల్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేస్తామని, వారంలో ఒకరోజు ఒక ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో ఫుట్ బాల్ ఆడుతారన్నారు.

## సమరం

(3వ పేజీ తరువాయి)

కంగనా రనౌత్ సహా పలువురు ప్రముఖులు పోటీచేస్తున్న నియోజకవర్గాల్లోనూ ఓటర్లు తమ తీర్పును ఇవిఎంలలో నిక్షిప్తం చేశారు. శనివారం నాటి పోలింగ్‌తో సార్వత్రిక ఎన్నికల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసినట్లయింది. ఇక ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. వీటితో పాటు ఎపి అసెంబ్లీ ఫలితాలు జూన్ 4వ తేదీన, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు జూన్ 2వ రానున్నాయి. కాగా, సార్వత్రిక ఎన్నికల తొలి ఆరు దశల్లో వరుసగా 66.14 శాతం, 66.71 శాతం, 65.68 శాతం, 69.16 శాతం, 62.2 శాతం, 63.36 శాతం పోలింగ్ నమోదైంది.

**బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు :** ఏడో విడతలోనూ బంగాల్‌లో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఆరున్నర సమయంలో 24 పరగణా జిల్లాలోని ఓ పోలింగ్‌బూత్‌లో మూక దాడి జరిగింది. కుల్తాలీ గ్రామంలో రిజర్వులో ఉంచిన ఇవిఎంలు, 2వీవీపాట్లు, సెక్టార్ ఆఫీసర్ పత్రాలను ఎత్తుకెళ్లి సమీపంలోని ఓ చెరువులో పడేశారు. పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్థానికులకు, పోలింగ్ ఏజెంట్లకు మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు బలవంతంగా పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించి ఈవీఎంను బయటకు తీసుకెళ్లి చెరువులో పడేశారు. ఆ పోలింగ్ కేంద్రంలో అదనపు ఈవీఎంలు తరలించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మేరిగంజ్‌లోని 2 పోలింగ్ కేంద్రాల వద్ద బిజెపి, టిఎంసి కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. జాదవ్‌పూర్‌లో ఐఎస్‌ఎఫ్, సిపిఎం మద్దతుదారుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగి ఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు గాయపడ్డారు. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం బాంబులు విసురుకున్నారని పోలీసులు తెలిపారు. గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భంగర్‌తో పాటు దక్షిణ 24 పరగణా జిల్లాలోని ఇత్‌ఖొలాలో రాళ్ల దాడులు జరిగాయి. సందేశ్‌ఖాలీలో అత్యాచార నిందితుడు టిఎంసి నేత షేక్ షాజహాన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. మహిళలు వెదురు కర్రలు, రాళ్లతో రోడ్లపైకి వచ్చి నిరసించారు. జయనగర్ లోక్‌సభ నియోజక వర్గంలో అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బిజెపి కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు చేరిఒకరిపైఒకరురాళ్లు రువ్వుకున్నారు.

## రాజధాని ముస్తాబు

(3వ పేజీ తరువాయి)

సన్నహాలు చేశారు. ఫ్లాగ్ వాక్ జరుగుతుండగా పదమూడున్నర నిమిషాల 'జయ జయహే తెలంగాణ' పూర్తి నిడివి గీతాన్ని విడుదల చేస్తారు. కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణిని వేడుకల్లో ప్రభుత్వం తరపున సన్మానించనున్నారు. రాత్రి 8 గంటల 50 నిమిషాల నుంచి పది నిమిషాల పాటు హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా బాణాసంచా కార్యక్రమం నిర్వహించనున్నారు.

**అత్యంత వైభవంగా వేడుకలు : సిఎం రేవంత్ రెడ్డి**

అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర చరిత్ర, సాంస్కృతిక పునరుజ్జీవనానికి సంబంధించిన కీలక నిర్ణయాలు ప్రకటించనున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. పరేడ్‌గ్రౌండ్‌లో ప్రధాన వేదికతో పాటు అతిథులు, ఆహ్వానితులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా ప్రత్యేక లాంజుల్లో కూర్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఎక్కడి నుంచైన దృశ్యాలను తిలకించేందుకు ఎల్‌ఈడి స్క్రీన్‌లను సిద్ధం చేశారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక స్టాళ్లు ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి.

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు జూపల్లి, పొన్నం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ ముస్తాబైంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య , తదితరులు పాల్గొన్నారు.



## ఎగ్జిట్ ఫలితాలు

(3వ పేజీ తరువాయి)

359కుపైగా సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ 154 సీట్లకే పరిమితం అవుతుందని, ఇతరులకు 30 స్థానాలు దక్కుతాయని రిపబ్లిక్ భారత్ పీ మార్గ్ అంచనా వేసింది. రిపబ్లిక్ భారత్ మ్యాట్రిజ్ కూడా బీజేపీ గాలి బలంగా వీచిందని వెల్లడించింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు 353 నుంచి 368 స్థానాలు వస్తాయని ప్రతిపక్ష ఇండియా కూటమికి కేవలం 118 నుంచి 133 స్థానాలే రావచ్చని తెలిపింది. ఇతరులకు 43 నుంచి 48 స్థానాలు వస్తాయని వెల్లడించింది. జన్ కీ బాత్ సర్వే కూడా ఎన్‌డిఎ కూటమికే పట్టం కట్టింది. కమలం పార్టీ నేతృత్వంలోని కూటమికి 362 నుంచి 392 స్థానాలు వస్తాయని తెలిపిన జన్‌కీబాత్ సర్వే ఇండియా కూటమికి 161 స్థానాలు దాటబోవని తేల్చి చెప్పింది. ఇతరులకు పది నుంచి 20 స్థానాలు వస్తాయని వెల్లడించాయి. న్యూస్ నేషన్ సర్వే కూడా కమలం పార్టీ వికసిస్తుందని అంచనా వేసింది. ఎన్‌డిఎకు 342 నుంచి 378 స్థానాలు వస్తాయన్న న్యూస్ నేషన్ సర్వే కాంగ్రెస్‌కు 153 నుంచి 169 స్థానాలు వస్తాయని తెలిపింది. ఇతరులకు 21 నుంచి 23 స్థానాలు దక్కుతాయని వివరించింది.

**తెలంగాణలో హస్తం, కమలం నువ్వా నేనా!**

హైదరాబాద్: తెలంగాణ లోక్‌సభ ఫలితాల్లో కాంగ్రెస్, బిజెపి మధ్య తీవ్రమైన పోటీ ఉన్నట్లుగా సర్వేలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 69 స్థానాల్లో విజయ దుందుభి మోగించబోతోందని మెజారిటీ సర్వే సంస్థలు అంచనా వేశాయి. మరోవైపు బిజెపి కూడా ఇదే స్థాయిలో స్థానాలు సాధిస్తుందని అంచనా వేస్తున్నాయి బిఆర్‌ఎస్ ఒక్క సీట్లకు పడిపోనుందని జోస్యం చెప్పాయి. ఆరా, ఇండియా టివి, పీపుల్స్ పల్స్, ఎబిపిసి ఓటర్, ఇండియా టివిసిఎన్‌ఎక్స్ కాంగ్రెస్, బిజెపి మధ్య నువ్వానేనా అని పోటీ ఉన్నట్లు తేల్చాయి. జన్‌కీబాత్ మాత్రం బిజెపికి అత్యధిక స్థానాలు వస్తాయని పేర్కొంది. ఎంఐఎం పార్టీకి హైదరాబాద్ స్థానం మళ్లీ దక్కుతుందని అన్ని సర్వేలు చెప్పడం గమనార్హం. 2019 ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు గాను బిఆర్‌ఎస్ 9 ఎంపీ స్థానాల్లో గెలుపొందింది. బిజెపి 4, కాంగ్రెస్ 3 స్థానాల్లో విజయం సాధించాయి. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మెజారిటీ ఎంపి స్థానాలు తామే సాధిస్తామని కాంగ్రెస్ మొదటి నుంచీ ధీమాతో ఉంది. బిజెపి అనూహ్యంగా పుంజుకున్నట్లు తెలుస్తోంది. గతంలో వచ్చిన స్థానాల కన్నా ఈసారి ఏమాత్రం తగ్గవని భారాస భావించింది. 0మెజారిటీ సర్వే సంస్థలు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపాయి.

**ఎపి అసెంబ్లీలో కూటమిదే అధికారం**

అమరావతి : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వివిధ మీడియా హౌస్‌లు, సర్వే సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని క్రోడీకరించి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందో అంచనా వేశాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో ఎపిలో ఇంతకుముందెన్నడూ నమోదు కాని విధంగా అత్యధికంగా 82.37శాతం పోలింగ్ నమోదైంది. భారీ పోలింగ్ తగినట్లుగానే ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. ఎపిలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 2,387 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది పోటీలో ఉండగా.. అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీలో ఉన్నారు. మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది బరిలో ఉన్నారు. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, పిఠాపురం అసెంబ్లీ బరిలో పవన్ సహా 13 మంది పోటీ చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ సహా 27 మంది పోటీలో నిలిచారు.

## ఢిల్లీకి నీటి విడుదలపై రేపు సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో నీటి కటకటను పరిష్కరించేందుకుగాను హిమాచల్ ప్రదేశ్ నుంచి మిగులు జలాలను విడుదల చేయాలని హర్యానాకు ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య వెకేషన్ బెంచీ ఈ కేసును విచారిస్తుంది. హర్యానా నుంచి నీటిని ఢిల్లీకి విడుదల చేయాలని కోరుతూ మంత్రి అతిశీ ఫిర్యాదు చేశారు. బిజెపి పాలిత హర్యానా, కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్ పేర్లను పిటిషన్‌లో చేర్చారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద ఈ హక్కులకు హామీ ఇవ్వబడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేసవిలో ఎండలు తారెత్తిస్తున్న క్రమంలో నీటిఎద్దడితో రాజధానివాసులు అల్లాడిపోతున్నారని, వారికి పరిశుభ్రమైన తాగు నీరు సముచితంగా అందించాలని పిటిషన్ పేర్కొంది.

































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## అప్రమత్తంగా శానిటేషన్ సిబ్బంది : కమిషనర్ శరత్‌చంద్ర

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి పోలీస్ అకాడామి వరకు జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను కమిషనర్ బి.శరత్‌చంద్ర శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రోడ్డులో పాదచారులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి రోడ్లు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నమన్నారు. కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు. కాలనీ, బస్తీలల్లో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ ఆటోలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, మల్లేష్, యాదగిరి, వెంకటేష్, కృష్ణ, నవీన్, రామాంజనేయులు, జగన్, డ్రైవర్లు, స్వీపర్లు పాల్గొన్నారు.

## ఇసిఐఎల్, సికింద్రాబాద్ మార్గంలో అదనంగా 8 మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరవాసులకు టిజిఎస్ ఆర్‌టిసి ఎండి సజ్జనార్ శుభవార్త తెలిపారు. ఇసిఐఎల్, సికింద్రాబాద్ మధ్య (రూట్ నంబర్ 24ఇ)లో సోమవారం నుంచి అదనంగా మరో 8 కొత్త మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడపనున్నమని తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ బస్సులు ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్ నుంచి ఎఎస్ రావు నగర్, సైనిక్‌పురి, అమ్ముగూడ, లాల్‌బజార్, కార్ఖానా, జెబిఎస్, ప్యాట్నీ మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటాయని, తిరిగి ఇదే మార్గంలో ఇసిఐఎల్‌కు వెళ్లుతాయని పేర్కొన్నారు. ఈ సర్వీసులను వినియోగించుకుని క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

## క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** బిఆర్‌ఎస్ పిలుపులో భాగంగా గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి ట్యాంక్ బండ్ వద్ద గల అమర జ్యోతి వరకు నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత బిఆర్‌ఎస్‌దే



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** అడుగడుగునా అవమానాలకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర ఏర్పాటుతో అగ్రగామిగా నిలిపిన దార్శనికుడు మాజీ సిఎం కెసిఆర్ అని మీర్‌పేట బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ పిలుపుమేరకు దశాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల్లో భాగంగా గన్‌పార్కు నుంచి ట్యాంక్‌బండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీకి మద్దతుగా శనివారం రాత్రి మీర్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం నుంచి చందన చెరువు అమరవీరుల స్థూపం వరకు బిఆర్‌ఎస్ నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్, కార్పొరేటర్లు, కోఅప్షన్ సభ్యులు, ఉద్యమకారులు, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బిఆర్‌ఎస్ పిలుపులో భాగంగా గన్‌పార్క్ నుండి తెలంగాణ అమరవీరుల అమరజ్యోతి వరకు జరిగిన ర్యాలీలో రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డిల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళలకు అవకాశాలతోనే అభివృద్ధి

### మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలలో మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం రాజేంద్రనగర్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు పోచమోని నీలమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మహిళా సమాఖ్య 70వ వార్షికోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య 70 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతికి అభివృద్ధికి సమానత్వానికి హింస సమాజానికి అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా ఎన్నో విజయాలను సాధించిన ఘనత మహిళా సమాఖ్యదని, మహిళా రిజర్వేషన్ బిల్లు,మహిళా అత్యాచార నిరోధక చట్టాలు,మహిళలకు ఉచిత విద్య,వైద్యం తోపాటు అంతరాలు లేని సమాజానికై నిరంతరం ఉద్యమాలు, పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. మహిళను అణిచివేసి, దోపిడీ పీడనకు గురిచేసి, అంగడి సరుకుగా మార్చిన పెట్టుబడిదారీ వ్యవస్థకు గోరి కట్టి, సమ సమాజ వ్యవస్థ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. జూన్ 4న భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు కమలమ్మ, మంజుల, కన్న గాని లక్ష్మి, వెంకటమ్మ, విజయలక్ష్మి, షామీం, సువర్ణ, ఎల్లమ్మ, రమాదేవి, లలిత పాల్గొన్నారు.

# వానాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ కె.శశాంక ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయంలో కలెక్టర్ శశాంక,జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి రాబోయే వానాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టవల్సిన చర్యలపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు,మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో ముంపు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని చర్యలు చేపట్టాలని తెలిపారు. నివాస ప్రాంతాల్లో, రోడ్ల పైన వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ముంపు ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని నాలాల్లో చెత్త లేకుండా శుభ్రం చేయించాలన్నారు. కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఎఎన్‌డిపి, ఎస్‌ఆర్‌డిపి.పనులు జరుగుతుంటే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే ప్రాంతాలను గుర్తించి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు సంబంధితశాఖల సిబ్బందిలో కలిసి సమన్వయంతో పనులు నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



### కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శనివారం చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లోని కంట్రోల్ రూంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిలతో కలిసి కౌంటింగ్ నిర్వహణ పై సంబంధిత ఎఆర్‌ఒలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి శశాంక మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఈనెల 4న చేపట్టనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపునకు గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### ఆకునూరి మురళి



**ప్రజాపక్షం/యాచారం :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు నాణమైన విద్యను ప్రభుత్వాలు అందిచాల్సిన అవసరం ఉందని రిటైర్ట్ ఐఎఎస్ అధికారి అకునూరి మురళి అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల్లో అయన పర్యటించారు. ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యావంతులు, ఉపాధ్యాయులతో గ్రామాల్లో తిరిగి విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అయా గ్రామాల్లో పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ఎంచెస్తే భాగుంటుందని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిచడం ఎలా చేస్తే సాధ్యమౌతుందని అందరితో చర్చించారు. గ్రామాల్లో నిరుపేద విద్యార్థులు చదువుకుంటారు వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన భాద్యత ఉందన్నా రు. చింతపట్ల గ్రామ పాఠశాల భవనాలను చూసి అయన సం తోషం వ్యక్తం చేశారు. మండలంలోని అని బడులు ఇదే విధంగా ఉంటే బాగుటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన ఊరు మనబడిని స్థాపించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న మహ్మద్ సాబెర్, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీకాంత్, శ్రీహరి, జహంగీర్‌లకు అయన అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు జగదిష్, మల్లేశ్, మహేశ్, సాబెర్ ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, పద్మజాషా, ఎన్‌అర్‌ఐ నిర్మల, ఉపాధ్యాయులు దాసు, శేఖర్, గ్రామస్తులు యాదగిరిరెడ్డి, కృష్ణ, రమేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు లేని కళాశాలల సీజ్

### ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గుర్తింపులేని కళాశాలలపై పూర్తిస్థాయి చర్యలు చేపట్టకుండా కేవలం నోటీసులతో సరిపెడుతున్న ఇంటర్ బోర్డ్ అధికారుల వైఖరి సిగ్గు చేటని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి విమర్శించింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని అనధికార శ్రీచైతన్య కళాశాల వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారి శ్రీదేవి హుటాహుటిన అక్కడికి చేరుకుని కళాశాల ప్రిన్సిపాల్ స్వామి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఇంటర్ బోర్డు కార్పొరేట్ కళాశాలలకు ఊడిగం చేసే బోర్డుగా మారిందని ఆరోపించారు. గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయకముందే నూతన సంవత్సర విద్యార్థులు ఇంటర్ అడ్మిషన్లు చేపట్టవచ్చని ప్రకటన చేశారని, దాని మూలంగానే గుర్తింపు లేని కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందారని ఆరోపించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిలాల్లో ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా 150 పైగా కళాశాలలు నడుస్తున్నాయంటే బోరు అధికార యంత్రాంగం ఏవిధంగా కార్పొరేట్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు నిజమే అని తెలుస్తుందన్నారు. ఎఐవైఎఫ్ గత 15రోజులుగా నిర్విరామంగా అనుమతులు లేని అనధికారికంగా నడుస్తున్న కళాశాలలలో సర్వే చేపట్టి చర్యలు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదులు చేసిందన్నారు. ఇంటర్మీడియట్ బోర్డుతో పాటు విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేయడంలో కార్పొరేట్ కళాశాలలు కొత్త పంథాను ఎంచుకుంటున్నారని, పూర్తి స్థాయి అఫిలియేషన్ పొందకుండానే బిల్డింగ్‌లు తీసుకోవడం, అరకొర సదుపాయాలు కల్పించడం, లక్షల రూపాయల ఫీజులు చేసి అడ్మిషన్లు నిర్వహించడం, అర్హత లేని బోధనా సిబ్బందితో పాఠాలు చెప్పడం తో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఇంటర్‌బోర్డ్ అధికారులు తక్షణమే గుర్తింపు లేని కళాశాలను సీజ్ చేసి, విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి కట్టిన ఫీజులను వాపసు చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్, అనిల్, బాలు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






















## బాధిత కుటుంబాలకు సాయం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : నాగర్‌కర్నూల్ జిల్లా ఇంద్రకల్ గ్రామసమీపంలో కోళ్లషెడ్డు నిర్మాణకూలిపనికి ముష్టిపల్లి గ్రామానికిచెందిన సల్వాది రాముడు, సల్వాదిచెన్నమ్మ వెళ్లి ఈదురుగాలులురావడంతో కోళ్లషెడ్డుగోడ కూలి వారిమీద పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపల్లి జగదీశ్వరరావు ఆర్థికసహకారంతో బాధితుల ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్సిసెల్ అధ్యక్షులు సల్వాదివెంకటయ్య, మాజీసర్పంచ్‌బత్తులనాగమ్మ కుర్మయ్య, ఎంపిటిసి తలారిఖాజ, వార్డుమెంబర్స్ బాలయ్య, పరుషరామ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గుర్రాలబాలయ్య, సల్వాదినాగరాజు, మొల్లంకుంటగోపి, మొల్లంకుంట సత్యం, మార్కంబా విరాజులు, బత్తులమహేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : తెలంగాణరాష్ట్ర అవతరణదినోత్సవం సందర్భంగా పెద్దకొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ఎండియూసుఫ్ ఆలీ శనివారం తెలిపారు.

**మల్దకల్:** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారంలో ఆదివారం కాంగ్రెస్ కార్యాలయం నందు జెడ్పి చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య ఆదేశాల మేరకు కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయగలరని కాంగ్రెస్ సీనియర్ నాయకులువై.శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

## నకిలీల నిర్మూలనకు సహకరించండి



ప్రజాపక్షం/అచ్చంపేట : ఫర్టిలైజర్ డీలర్లు నిబంధనలు ఉల్లంఘించరాదని నకిలీ విత్తనాలు , కాలంచెల్లిన విత్తనాలు దుకాణాల్లో ఉండరాదని విక్రయించరాదని ఆర్‌డిఓ కె.మాధవి స్పష్టంచేశారు. శనివారం పట్టణంలో ఫర్టిలైజర్‌షాపులను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఎరువుల దుకాణాల్లోని విత్తనాలు, ఫర్టిలైజర్‌యొక్క రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను వ్యవసాయశాఖ గుర్తింపుపొందిన డీలర్లకు అందుబాటులో ఉంచామని వాటిని మాత్రమే కొనుగోలుచేసి తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. రైతులు కొన్న విత్తనాలకు పురుగులమందులకు డీలర్లనుండి కచ్చితంగా రశీదుతీసుకొని కొనుగోలుచేసిన విత్తనాలు, ఎరువుల సంచులను భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తులవద్ద విత్తనాలు, ఎరువులు తీసుకోరాదని సూచించారు.

## ఘనంగా సన్మానం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : కొల్లాపూర్ మున్సిపల్ 6వవార్డు కౌన్సిలర్ నూతన చైర్మన్‌గా మేకలరమ్యనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శనివారం చైర్మన్ నివాసంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ అతనిబృందం మేకలరమ్య నాగరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.కొల్లాపూర్ మున్సిపాలిటిని మరింతగా అభివృద్ధిచేయాలని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సుధాకర్, రామస్వామియాదవ్, కుర్మయ్య, జగదీష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాసులు, నాని, కృష్ణమాచారి, వెంకటకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి : చంద్రబాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే ఏ ఎన్నికల్లోనైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యనాయకులు, గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబును జూబ్లీహిల్స్‌లో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానంగా తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతంపై పూర్తి స్థాయి దృష్టి సారిస్తానని తమ్ముళ్లకు హామీనిచ్చారు. తనకు రెండు రాష్ట్రాలు ముఖ్యమేనని అన్నారు. తెలంగాణలో పార్టీ పటిష్టం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి సిద్ధం కావాలన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను అవగాహన చేసుకుని తెలుగుదేశం కార్యకర్తలు స్వతంత్రంగా వ్యవహరించి ఎదగాలన్నారు. తద్వారా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. అందుకు తాను శాయశక్తుల సహాయ సహకారాలు అందిస్తామని తమ్ముళ్లకు బాబు భరోసా ఇచ్చారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ గత వైభవం కోసం కృషి చేస్తానని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో తెలుగువారిదే పైచేయిగా ఉండాలని ఆకాంక్షించారు. అందుకోసం తాను ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానన్నారు. ఈ సమావేశంలో పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబు, నల్లెల్ల కిశోర్, పి. బాలరాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో 17మంది రిటైర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 17 మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందారు. వీరిలో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఓ అండ్ ఎం డివిజన్ 2 (ఏ) జనరల్ మేనేజర్ ఎం.డి. ఖాదర్ మొహియుద్దీన్ తదితరులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జలమండలి ద్వారా ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషమన్నారు. పదవీవిరమణ తర్వాత కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, జీవితం హాయిగా గడవాలని ఎం.డి. ఆకాంక్షించారు. పదవీవిరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, సిజిఎంలు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, వినోద్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్





ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. హైదరాబాద్‌లో 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని తెలిపారు. ప్రతి కౌంటింగ్ హాల్లో 14 ఏర్పాటు చేశామన్నారు. జూబ్లీహిల్స్‌లో 20 , యాకుత్‌పురాలో 24 రౌండ్‌లలో, చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇక కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లను 17 రౌండ్‌లలో లెక్కిస్తామని వివరించారు. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు వివి ప్యాట్‌ల స్లిప్పులను లెక్కిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పరిశీలకుడు చొప్పున 15 మంది పరిశీలకులు ఉంటారన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని తెలిపారు. జిల్లాలో ఓట్ల లెక్కింపుకు 1200 మంది కౌంటింగ్ సిబ్బందిని, వెయ్యి మందికి పైగా ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి రౌండ్ పూర్తవగానే ఎంకోర్ యాప్‌లో డాటా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారిక కమ్యూనికేషన్ రూమ్, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని రోనాల్డ్ రోస్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ ఆర్‌డిఓ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిహ్నం, గీతంపై బిఆర్‌ఎస్‌వి కుటిల రాజకీయాలు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు వై. శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం / మల్దకల్ : జయ జయహే తెలంగాణ సంగీత దర్శకుడిపై విమర్శలు సహేతుకం కాదని, టిఆర్ఎస్ సంకుచిత కుటిల రాజకీయాలకు పరాకాష్టకు చేరుకున్నాయని బిజ్వారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు వై శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య ఆదేశాల మేరకు బిజ్వారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ నాయకులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ కళాతోరణం. చార్మినార్ తొలగింపు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ మంత్రులతో, మేధావులతో స్పష్టంగా చర్చలు జరిపి ఆ రెండు గుర్తులు సామాన్యుల పై పెత్తనం చేసే ఆనవాళ్ళుగా అభిప్రాయంతో పాటు 1969 తొలిదశ ఉద్యమ స్మృతులకు స్థానం కల్పిస్తూ, పోరాట పటిమను జ్వలించేలా రూపకల్పన చేస్తూ వ్యవసాయం ప్రతిబింబించేలా, సర్వ మతాలకు ప్రతీకగా నిలిచిపోయే విధంగా రాష్ట్ర అధికార చిహ్నం, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో ప్రారంభ గీతం గా ఆలపించేందుకు అనువుగా తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన పై కవి అందె శ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో కల్పించి తెలంగాణ పదేళ్ల దశాబ్ది ఉత్సవాలకు కసరత్తు చేస్తున్న కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక గుర్తింపు వస్తుందనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం మనుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి. సత్యా రెడ్డి, తెలుగు కష్ణమూర్తి, శ్రీనివాస్‌గౌడ్, కొంకల గోకరన్న , మెకానిక్ గోవిందు, వడ్డె గోపాల్, కుక్కల లక్ష్మ న్న, తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ విత్తనాల వివరాలివ్వండి



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : వనపర్తి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అందుబాటులో ఉన్న విత్తన వివరాలను రైతులకు వెల్లడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె. చంద్రయ్య జిల్లా కలెక్టర్‌ను, జిల్లా వ్యవసాయ అధికారిని కోరారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో పత్తి విత్తనాలు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ ప్రభావం జిల్లా రైతులపై ఉందన్నారు. రైతులు వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, పత్తి, కంది తదితర పంటలు సాగు చేస్తానన్నారు. రోహిణి కార్తి రావటంతో బోర్ల కింద వరి నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఏఏ పంటలు ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారన్నారు. ఎంత విత్తనం అవసరం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విత్తనం ఎంత అన్న వివరాలుప్రకటించాలన్నారు. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిస్తే రైతుల్లో ఆందోళన ఉండదన్నారు. కృత్రిమ కొరత సృష్టించి విత్తన డీలర్లు, వ్యాపారులు అధిక ధరకు రైతులకు అంటగట్టే ప్రమాదం తప్పుతుందన్నారు. నకిలి, కల్తీ, విత్తనాలు నానాటికి పెరుగుతున్నాయని రైతులు నష్టపోతునే ఉన్నారన్నారు. మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు , ఎమ్మార్వోలు ప్రతినిత్యం విత్తన దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు అమ్మకుండ షాపుల వద్ద ధరలను నోటీస్ బోర్డులపై పెట్టేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ , కల్తీ విత్తనాల అమ్మకం దారులు, బ్లాక్ మార్కెటిర్లపై పిడి యాక్ట్ కింద కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతుల సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సిపిఐ గోపాల్‌పేట మండల మాజీ కార్యదర్శి శాంతన్న పాల్గొన్నారు.

## 'ఆశా'లకు నష్టం కల్గించొద్దు



ప్రజాపక్షం / కొత్తకోట: కొత్తకోట ఆశలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ మం డల అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. శనివారం కొత్తకోట ప్రాథమిక ఆసుపత్రి ముందు ఆశా కార్యకర్తలు నిరసన తెలిపి డా. శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశలకు ఇస్తున్న పారితోషకాలకు 18000 పెంచి ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని ఆమె డిమాండ్ చేశారు. 50 లక్షలు ఇన్సూరెన్స్‌ను వెంటనే సర్కులర్ జారీ చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలకు చెల్లించాలని ఇస్తున్న పారితోషకాలలో సగం పెన్షన్ చెల్లించాలని మూడు సంవత్సరాల పెండింగ్ యూనిఫామ్స్ వెంటనే ఇవ్వాలని ఆశలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. పుష్ప, రేణుక, చంద్రకళ, మంజుల, వరలక్ష్మీ, ఇందిరా, స్వాతి, గీత , రజిత, కాంచన తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ చదువుకు అండగా ఉప్పలట్రస్టు

ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలపరిధిలోని తుర్కలపల్లి గ్రామానికిచెందిన ప్రజ్ఞ పైచదువులకొరకు తెలంగాణరాష్ట్ర మిషన్‌భగీరథమాజీ వైస్‌చైర్మన్, బిఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పలచారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ హైదరాబాద్‌లోని ఆకాష్‌జూనియర్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి కళాశాలలో చేర్పించి అమ్మాయి పైచదువులకు సహకరించారు. తన అమ్మాయిచదువుకు సహకరించిన ఉప్పలవెంకటేష్‌కు అమ్మాయి తల్లిదండ్రులు శేఖర్ రుణపడి ఉంటామనికృతజ్ఞతలు తెలియజేశారు. ఉప్పలవెంకటేష్ మిత్రమండలి సభ్యులు, బిఆర్‌ఎస్‌వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు,భాస్కర్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆసరా' పెన్షన్ ఎప్పుడిస్తారు?



ప్రజాపక్షం/మానవపాడు: భర్త చనిపోతే భార్యకు ఆసరా పింఛన్ నిబంధనలను తెలంగాణ సర్కారు సులభతరం చేసింది. భర్త చనిపోతే ఆయన భార్యకు వెంటనే ఆసరా పింఛన్ అందేలా ఏర్పాట్లు చేసింది. కానీ ఈ మేరకు గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఉత్తర్వులు జారీ చేయించిన ఫలితం లేకపోవడంతో కొంత మంది వితంతువులకు నిరాశే మిగులుతుంది. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురంలో వికలాంగుడు పేరు బోయ తలారి శంకర్, అతని భార్య బోయ తలారి పద్మ వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు కుమార్తెలు పేర్లు వాణి, గీత. ఇదిలా ఉంటే తలారి శంకర్ చనిపోవడం జరిగింది. శంకర్ చనిపోయి 2 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఆసరా పెన్షన్ రాలేదని బోయ తలారి పద్మ వాపోయింది. మండల ఎంపిడివో గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రభుత్వ అధికారులు దగ్గరకు వెళ్లినా ప్రయోజనం చేకూరడం లేదన్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ అయినా ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

## ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సిద్ధం



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: నేడు (జూన్2) జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌటింగ్ కు ఎన్నికుల కమిసన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌటింగ్ ఏర్పాట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీన (నేడు) ఉదయం 8 గంటలకు మహబూబ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాళాశాల లో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. కౌటింగ్ సిబ్బంది ఉదయం 6 : 30 కల్లా కౌంటింగ్ కేంద్రంలో రిపోర్టు చేస్తారు. కౌంటింగ్ టేంటింగ్ వద్ద కేటాయింపు చేసిన కౌంటింగ్ సిబ్బంది ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కంపు కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంటుందని అన్నారు. ఉదయం 7: 30 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి బ్యాలెట్ బాక్సులు తీసుకువస్తారు. కౌంటింగ్ టేంటింగ్ వద్ద ఏ టైం కి చేసిన కూంటింగ్ సిబ్బంది ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమం ప్రకారం ఓటర్లు ఓటు వేస్తారు. కబట్టి కౌంటింగ్‌లో భాగంగా మొదట ప్రారంభ లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ కోసం ఐదు ఏర్పాటు చేశారు. ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను, వచ్చిన బ్యాలెట్ పేపర్లను లెక్కిస్తారు. అనంతరం మొత్తం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారిస్తారు. ప్రారంభ లెక్కంపు అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కించి, మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడు ఓట్లను సాధించినట్లయితే అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు. ఏ అభ్యర్థికీ కోటా రానట్లయితే చివరికి మిగిలినఅభ్యర్థిగెలుపొందినట్టుగాప్రకటిస్తారు.

## ఎప్పటికీ రాజీమార్గమే రాజమార్గం

జిల్లాప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: కేసుల పరిష్కారానికి జాతీయ లోక్అదాలత్‌ను ఉపయోగించుకోవాలని జిల్లాప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్ బాబు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకోర్టు ఆవరణలో రాష్ట్ర న్యాయసేవా అధికారసంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఈనెల 8నజరగబోయే రెండోజాతీయ లోక్అదాలత్ నిర్వహించడానికి సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరకాలంనుంచి లోక్అదాలత్‌ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యాయని, మన జిల్లాలో రాజీకుదుర్చుకునే కేసులు 8287 కేసులున్నాయని జూన్ 8న జరగబోయే జాతీయ లోక్అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసు అధికారులు, న్యాయశాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఇరుపార్టీలు రాజీకావడంవల్ల సమయభావం, డబ్బు తగ్గుతాయని కక్ష్యలు, కార్పణ్యాలు నశిస్తాయని, ఇరువర్గాలవారు సంతోషంగా ఉంటారని దీనివల్ల సమాజానికి ఎంతోమేలు జరుగుతుందని తెలిపారు. ఎక్సైజ్, విజిలెన్స్, ఎలక్ట్రిసిటి అధికారులతో మాట్లాడుతూ కాంపౌండింగ్ అయ్యే కేసులు అన్ని పరిష్కారం అయ్యే విధంగా కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాన్యాయసేవా అధికారసంస్థ సెక్రటరీ సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి పి.మౌనిక, మొదటి ఆడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి మమతారెడ్డి, రెండో ఆడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనిధి, జిల్లా పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది దేవిక, కేశవరెడ్డి పాల్గొన్నారు.

## అమ్రాబాద్ టైగర్ ఫారెస్టులో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాపక్షం/అచ్చంపేట : అమ్రాబాద్ టైగర్‌రిజర్వుఫారెస్టులో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాలులో మాట్లాడుతూ సిఎస్ శాంతకుమారి ఆదేశాలతో అమ్రాబాద్ టైగర్‌రిజర్వుఫారెస్టులో పూర్తిగా ప్లాస్టిక్‌రహితంగా చేయాలని ఆదిశగా ప్రజలకు అవగాహనకల్పించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంపై అటవీ శాఖ అధికారులు శనివారం మన్ననూర్ ఏకోడెవలప్‌మెంట్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వారికి అవగాహన కల్పిస్తున్నట్లు అటవీశాఖ డిఎఫ్ఓ రోహిత్‌గోపిడి తెలిపారు. ఒకసారివాడిన ప్లాస్టిక్‌కవర్లతో టైగర్ రిజర్వుఫారెస్టు కేంద్రంలోని వన్యప్రాణులకు హాని కలుగుతుందనికావున ప్లాస్టిక్ రహితంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌బాటిల్స్, కూల్‌డ్రింక్స్ బాటిల్స్, ప్లాస్టిక్‌తరవస్తువులు నిషేదించామని తెలిపారు. స్టీల్‌బాటిల్స్, గాజుసీసాలతోకూడిన బాటిల్స్ అనుమతించనున్నట్లు తెలిపారు.పేపర్‌బ్యాగులనువాడాలని సూచించారు. ఈవిషయంపై చెక్‌పోస్టువద్ద గట్టి నిఘా ఏర్పాటుచేసి ప్రతి వాహనాన్ని తనిఖీచేస్తామని తెలిపారు.

## వృత్తిలో రిటైర్‌మెంట్ ఒక భాగం



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన వెంకటేశ్వర్ రెడ్డి, ఏఎస్ఐ పాన్‌గల్ పిఎస్ ఎస్. గోపాలరెడ్డి, ఏఎస్ఐ మదానాపూర్ పిఎస్ ఎం. చెన్నయ్య, హెడ్ కానిస్టేబుల్ పెద్దమందడి పిఎస్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నిన్నటితో తమ సర్వీస్‌ను ముగించుకొని పదవీ విరమణ పొంద డం జరిగిందన్నారు. గత 35 సంవత్సరాల 4 నెలల 27 రోజులు క్రమ శిక్షణతో పోలీస్ శాఖలో పని చేస్తూ ప్రజలకు సేవలు అందించిన ఈ ముగ్గురు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరిగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబాల ప్రస్తుత స్థితిగతులనుఅడిగి తెలుసుకున్నారు. రిటైర్మెంట్ పొందిన వారి కుటుంబ సభ్యులు , అడిషనల్ ఎస్పీ వీరరెడ్డి, డిఎస్పీ జె. వెంకటేశ్వర రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పల్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణికి అత్యుత్తమ పనితీరు అవార్డు

ముస్సోరిలో జాతీయ స్థాయి సిఇఒల సమావేశంలో ప్రదానం



ప్రజాపక్షం/హైదరాబాద్: సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్‌కు జాతీయస్థాయి ట్రిపుల్ ఐఇ (ఇండియన్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్) సంస్థ వారు ప్రతిష్టాత్మక పెర్ఫార్మెన్స్ ఎక్సెన్స్ అవార్డు 2024ను ప్రకటించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో శుక్రవారం రాత్రి జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.ఆయన చూపిన చొరవతో 202324 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ తన చరిత్రలోనే అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తిని, బొగ్గు రవాణాను సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. అంతేకాదు 35,700 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి కన్నా అధికంగా సాధిస్తూ సరికొత్త రికార్డులు సృష్టించడంతో జాతీయ స్థాయిలో సింగరేణి మంచి పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వారు ఆయనకు వ్యక్తిగతంగా పెర్ఫార్మెన్స్ ఎక్సెన్స్ అవార్డు 2024ను బహుకరించడం జరిగింది.అలాగే కంపెనీల విభాగంలో అద్భుతమైన పనితీరును కనపరిచిన కంపెనీగా సింగరేణికి పెర్ఫార్మెన్స్ ఎక్సెంట్ అవార్డును నిర్వాహకులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ నుండి జనరల్ మేనేజర్ (ఎంఎస్) టి. సురేష్‌బాబు అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ఎన్ భాస్కర, డిజిఎం(ఐఈ) సిహెచ్ సీతారాంబాబు, ట్రిపుల్ ఐ ఈ గౌరవ కార్యదర్శి ఎవివి ప్రసాద్ రాజు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ లోని ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి వల్లనే లక్ష్యాలు సాధించగలిగామని, సింగరేణికి లభించిన అవార్డులు సింగరేణి సంస్థ ఉద్యోగులకు చెందుతాయని, ఈ స్ఫూర్తితో మరింతగా పనిచేస్తూ ఉన్నత లక్ష్యాలు సాధించాలని సి అండ్ ఎండి ఎన్.బలరామ్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

## గుట్కాల అమ్మిన వారిపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/బంట్వారం :** మండల పరిధిలో ఉన్న బోపునారం, తురుమామిడి, బస్వాపూర్, రొంప ల్లి, సల్‌బత్తాపూర్, యాచారం, మాలసోమారం త దితర గ్రామాల్లో ఆక్రమ మద్యం పొగకు గుట్కాల అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బంట్వారం స్థానిక ఎస్ఐ శ్రీశైలం శనివారం అన్నా రు. ఆయన మాట్లాడు తూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యనికి హానికరమై న గుట్కాను నిషేధించేందుకు, గుట్కా తయారీ, అమ్మకలపై నిషే దం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్తర్వులు జా రీ చేసిన విషయం పాఠకులకు తెలిసిన విషయమే ని అది గుర్తుంచుకోని మండల కేంద్రాంతో పలు గ్రామాల్లో ఎక్కడ కూడా గుట్కా అమ్మిన నిల్వ ఉంచిన, విక్రయాలు జరిపిన అ ట్టి వారి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో జరుగు తుందన్నారు. గూట్కా వల్ల ప్రజలు రోగాల భారీన పడుతున్నారని చాలా మంది కాన్సర్ బారీన పడి ప్రా ణాలు స హితం కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి దుకాణ దారులు గుట్కా కైనీ, తంబకు, పోగాకు విక్రయాలు నిలిపివే యాలని పేర్కోన్నారు.



## ఆవిర్భావ దినోత్సవానికి కొడంగల్ ముస్తాబు

**ప్రజాపక్షం / కొడంగల్ :** ఎంతో మంది ప్రాణా త్యాగాల వల్ల సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయి న కొడంగల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ని యోజకవర్గంలోని కడ కార్యాలయంలో, మున్సి పల్ కార్యాలయంలో, తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ పలు ప్రభుత్వ రంగ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ రంగ సంస్థలలో కూడా ఆవిర్భావ వేడుకలను ని ర్వహించేందుకు సన్నదం అవుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో కూడా ఆ పార్టీ నాయకులు జాతీయ జేండాను ఎగురవేసి సంబరాలు చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరు గుతుందని తెలిపారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**పజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కార ణంగా విద్యుత్‌కు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవీందర్ తెలిపారు.చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సావన్ ఎలక్ట్రానిక్స్ ఫీడ ర్‌ను 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు నిలిపివేయడంతో ఐ డిఏ ఫేస్ 5 ప్రాంతం,11 కెవి నవోదయ ఇండస్ట్రీయల్ ఏరియా,ఐకామ్ ఫీడర్లను 2.30 గంటల నుండి నిలిపివేయడంతో నవోదయ ఇండస్ట్రీయల్ ఏరియా,ఐడిఏ ఫేస్1 ఏరియాలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని రవీందర్ తెలిపారు.

## హనుమాన్ జయంతి



**పజాపక్షం/నాగారం:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ శ్రీ రమా సహిత సత్యనా రాయణ స్వామి, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో అభయాంజనేయస్వా మికి విశేష అభిశేకం, అర్చన, 108 సార్లు హనుమాన్ చాలీసా పారా యణం ,అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అభయాంజనేయ స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమం,భజన, హరతి తీర్థ ప్రసాదల వితరణ చేశారు. చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్,వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సి లర్ లావణ్యశ్రీనివాస్,సభ్యులు ఉమాశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

**శామీర్‌పేట:** ఉమ్మడి శామీర్‌పేట మండలంలో హనుమాన్ జయంతి వేడు కలను శనివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రా మాల్లో ఉన్న హనుమాన్ ఆలయాలను సుందరంగ ముస్తాబు చేశారు. హ నుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి చందన అభిషేకాలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. లక్ష్మాపూర్‌లోని శ్రీరాములగుట్ట దేవస్థానంలో వెలిసిన పంచముఖ హనుమాన్ ఆలయంలో వేదపండితులు మంత్రోచ్చరణలతో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఉప్పర్‌పల్లిలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు అన్న దానం చేశారు. తూంకుంటలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ మా లధారణ చేసిన స్వాములు కొండగట్టుకు బయల్దేరారు. మాజి ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మందాయిపల్లి లోని హనుమాన్ ఆలయంలో భక్తులు హనుమాన్ జయంతి పూజలు భక్తితో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హనుమాన్ జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలలోని హనుమాన్, రామా లయాలలో ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని గాజులరామా రాం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొ రేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలలో అన్ని బస్తీలు, కాలనీలలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. పలు చోట్ల హనుమాన్ మాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని బాచుపల్లి, కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయ, లలితా దేవి, శ్రీ సువర్చలా సమేత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హను మాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకము, విశేష అలంకారన, వడమాల, తమలపాకుల, సింధూరాధి విశేష అర్చన, 27 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు చేశారు.

**జగద్గిరిగుట్ట:** జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో, శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా, శ నివారం శ్రీ హనుమాన్ భక్తమండలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జ యంతి ఉత్సవాలకు, వారి యొక్క ఆహ్వానం మేరకు, ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమా లను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్.మాట్లాడుతూ, నియోజక వర్గ ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలను తెలియచేశారు. శ్రీ ఆంజనేయ స్వామి ప్రజలందరికీ శక్తిని, ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకు న్నానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ భక్తమండలి కార్యవర్గ స భ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీర్వాదంతో విజయం మాదే

### బిజెపి యువనాయకులు విశ్వజిత్‌రెడ్డి

**ప్రజాపక్షం /కోట్‌పల్లి :** అమ్మవారి ఆశీర్వాదంతో జూన్ 04 తేదిన పార్ల మెంట్ అభ్యర్థి గెలుపు విజయం మాదే నని బిజెపి యువ నాయకులు విశ్వ జిత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శనివారం కోట్‌పల్లి మండల కేంద్రం లోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయ ద్వితీయ వార్సికోత్స వంలో ఆయన స్థానిక యువ నాయకులతో కలిసి పాల్గోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వికారాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ వడ్ల నందు, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయా దవ్, ఎంపీటీసీ బందెయ్య యువ నాయకులు శివకుమార్, తలారి రాజు, యాదగిరి, ఓగ్లాపూర్ రాజు, తుమ్మలి రాజు, రాజునాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు అంజయ్య, శరణారెడ్డి, మోనాచారీ, మహెందర్ దొర, రావిరాల రవి, తదితరులున్నారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అక్కన్న మాదన్నలు ప్రతిష్ఠించిన శ్రీవిష్ణు శివాలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం అంగ రంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మి వేంకటేశ్వర స్వామి, భవాణి రామలిం గేశ్వర స్వామిలను ఎదుర్కొలుగా ఆలయానికి తీసుకవచ్చి అత్యంత సుంద రంగా అలంకరించిన కల్యాణ వేదికపై దేవతామూర్తుల కల్యాణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో, భా జ బజంత్రీలతో, భక్తుల హరి శివ నామస్మరణతో ఆలయ ప్రాంగాణం మా ర్మోగింది. కల్యాణం అనంతరం దేవతామూర్తులను భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో దర్శించుకుని తరించారు. అనంతరం మహిళా భక్తులు అమ్మవా ర్లకు ఓడి బియ్యం పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. కల్యాణవేడుకల ను తిలకించేందుకు ఉద్దెమర్రి గ్రామ భక్తులతో సహ చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణంలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏ ర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి ఈటెల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, మాజి ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, హరి వర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మంద శ్రీనివాస్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగో పాల్‌రెడ్డి, బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, శంకర్‌గౌడ్, పాల్గొన్నారు.

# వేగంగా లెక్కింపు

### జిల్లా ఎన్నికల అధికారి గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఈ నెల 4న జరు గనున్న మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల కౌం టింగ్ సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సిబ్బంది పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతం సూచిం చారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్ర మం కోసం ఏఆర్ఓ కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌం టింగ్ అసిస్టెంట్లలకు జరిగిన శిక్షణా కార్యక్రమం లో వారిని ఉద్దేశించి ఆయన పలు సూచనలు చే సారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ఏడు సెగ్మెంట్లలలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం 20 ఏర్పాటు చేసామని, ఓట్ల లెక్కింపు వేగవం తంగా, సమర్థంగా పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఈవిఎం ఓట్ల లెక్కింపు కం టె ముందుగానే ప్రారంభించాలన్నారు. ఉదయం 8 గంటల నుండే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రా రంభించేందుకు పోస్టల్ బ్యాలెట్ కవర్ తెరచి డిక్ల రేషన్ వ్యాలిడిటీ, ఇన్‌వ్యాలిడిటీ ఓట్లను వేరు చేసి జాగ్రత్తగా ధృవీకరించుకొని బండల్స్ చేసి లెక్కిం పుకు సిద్ధంగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రం లో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ఎ న్నికల సంఘ మార్గదర్శకాల ప్రకారం కొనసాగిం చాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతం తెలి పారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్‌డిఓ శ్యా మ్ ప్రకాష్, జిల్లా శిక్షణా నోడల్ అధికారి కేశ రామ్, జిల్లా మాస్టర్స్ ట్రైనర్ తిరుమలేష్, గోపాల్ ఇతర సంబంధిత సిబ్బంది ఈ శిక్షణా కార్యక్ర మంలో పాల్గొన్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు మేడ్చల్ జిల్లా సిద్ధం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం జరిగి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ద శాబ్ది ఉత్సవాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఘనం గా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నిద్దమైంది. శామీర్‌పేటలోని స మీకృత జిల్లా అధికారుల కార్యాలయ ప్రాంగణ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు పతాకావిష్కరణ చేయనున్నారు.అనం తరం ప్రజా ప్రతినిధులు, తెలంగాణా ఉద్యమ పోరాట నేతలు, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు, మీడియా సిబ్బంది స్వతంత్ర పోరాట యోధులతో పాటు జిల్లా వ్యాప్త ప్రముఖుల సమక్షంలో జిల్లా స్థాయి వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు వివిధ కార్యక్రమాలను నిర్వహించను న్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ భవనా లను రంగు రంగుల దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

## బహుళ అంతస్తుల నిర్మాణం.. పట్టించుకోని అధికారులు

### సిపిఐపార్టీ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** రంగారెడ్డి నగర్ డివి జన్ పరిధిలోని స్థానిక గిరి నగర్ బస్తీలో పక్కింటి వారి స్థలమును ఆక్రమించి బౌలాంతస్తుల నిర్మా ణం చేస్తున్న గరిగే శేఖర్ ముదిరాజ్ అనే వ్యక్తి విషయంలో గతంలో అనేకమార్లు టౌన్ ప్లానింగ్ సెక్షన్లో ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ స్థానిక అధికా రులు పట్టించుకున్న దాఖలాలు లేవు శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో భోజనాలు చే స్తున్న సమయంలో ఐదు అంతస్తుల భవనం నుండి గోవా కర్ర రేకుల రూమ్ యందు విరిగిప డి తృటిలో ప్రమాదం తప్పింది పేదలు ఫిర్యాదు చేస్తే బడా బాబుల కొమ్ము కాస్తూ సర్కిల్ అధికా రులు ప్రవర్తిస్తున్నారు ఇలాంటి విషయంపై సిపి ఐ గిరి నగర్ శాఖ నుండి కుత్బుల్లాపూర్ సర్కిల్ ఆఫీస్ ముట్టడించి కమిషనర్ మరియు టౌన్ ప్లా నింగ్ అధికారులకు సమస్యను వివరించడం జరి గింది. మున్సిపల్ ఉన్నప్పుడే నిర్మించుకున్న ఇం టిని స్థలం నాదని పైన తెలిపిన గరిగే శేఖర్ ఆక్ర మించుకోవడంకి ప్రయత్నిస్తూ పైన స్లాబులు రెం డు పీట్ల మేరకు జరిగి కట్టుకొని టౌన్ ప్లానింగ్ సెక్షన్ వారి ఆదేశాలను కూడా బేఖాతారు చే స్తూ బౌలాంతస్తుల నిర్మాణం చేస్తున్నాడు. టౌన్ ప్లానింగ్ మరియు కమిషనర్ గార్ల హామీ మేరకు 6/6/24 వరకు చూసి చట్టరీత్యా చర్య తీసుకోక పోతే పెద్ద ఎత్తున సిపిఐ పార్టీ, స్థానికులతో కలిసి మున్సిపల్ కార్యాలయమును ముట్టడి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య, కుత్బుల్లాపూర్ మండల సిపిఐ సహాయ కార్యదర్శి కే.దుర్గయ్య, శాఖ కార్యదర్శి ఎండి.యాకుబ్, రంగారెడ్డి నగర్ డివిజన్ సిపిఐ పార్టీ నాయకులు శ్రీనివాస్, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రా వు, మండల కార్యవర్గ సభ్యులు రాములు, బా బు, నర్సింగ్, నరసింహా, గిరి నగర్ స్థానికులు విద్యాసాగర్, అరుణ శ్రీనివాస్, అనిత, లక్ష్మి, రాజు నారాయణ మరియు బస్తీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించడంలో నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో నా లుగు మున్సిపాలిటిలు ఉన్నాయి. వికారాబాద్ ,తాండూర్ , పరిగి, కొడంగల్ పరిధిలలో కొన్ని వేలకుపైగా ఇళ్లు ,భవనాలు , వాణిజ్య భవనాలు,బహుళ అంతస్తు భవనలు ,మున్సిపాల్ పా ర్కులు ఉన్నాయి. ఇందులో 20శాతం కుడా ఇంకుడుగుంతల ను నిర్మించలేరు ప్రతిరోజు వినియోగించే నీటితోపాటు వర్షపు నీ టిని కూడా ఒడిసిపట్టి ఇంకుడుగుంతలకు మల్లిస్తే భూగర్భజలా లు అడుగంటకుండా ఉంటాయి. ప్రభుత్వం కానీ ,పాలకులు కా నీ ప్రజలు కానీ పెద్ద గా శ్రద్ద తీసుకోక పోవడంతో ఇంకుడుగుం తలు కనిపించడం లేదు దీంతో నీరు వృథాగా పోవడముకాకుం డా భవిష్యత్‌లో త్రాగు నీటికి ఇబ్బందులు పేరుతుగుతాయి.నీటి చుక్కను ఒడిసి పట్టుకునేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టిం చుకునే వారే లేకుండా పోయారు. వర్షపు నీరు వృథాగా పోనివ్వ కుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలను నిర్మించుకోవానలి సూ చించారు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు తప్పనిసారిగా ఇం కుడుగుంత్తను ఏర్పాటు చేసుకోవాలిని ,లేకపోతే ఇంటి నిర్మాణ అనుమతి ఇవ్వొద్దని నిబంధన విధించింది. సిమెంట్ రోడ్లతో రో జు రోజుకు పట్టణాలు కాంక్రిట్ జంగిల్స్ గా మారుతున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతి సమయంలో భవన నిర్మాణ చార్జీలతో పాటు ఇంకుడుగుంతలను నిర్మించుకునే వరకు అందుకు అ య్యే ఖర్చు ను డిపాజిట్ రూపంలో మున్సిపాలిటీలు అందజే యాలి అదేశించిది .కాని ,వికారాబాద్ జిల్లాలో ఎక్కడా కుడా ఇంకుడుగుంతలను అమలు చేయడం లేదని తెలుస్తుంది .ఇంకు డుగుంతలు మున్సిపాల్ పార్కుల్లో ,వెంచర్లలోగాని నిర్మించ డంలో మున్సిపల్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. కొత్త ఇళ్లకు అనుమతులు ఇచ్చేటప్పుడు వరి వద్ద తప్పని సరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా పురపాలకు అధికా రులు కఠినంగా వ్యవహరించాలని ప్రణాళిక విభాగాలకు అదే శాలు జారీ చేయాలని కోరుతున్నారు. ఈ సంవత్సరం ఎండలు ఫిబ్రవరి ,మార్చి, ఎప్రిల్, మేలలో ఎండలు దంచికొడుతుండడం తో ఇప్పటికే చెరువులు ,కుంటలు రిజర్వాయర్లలో ఇళ్లలో ని బో రుబావులు ,బావులు ఎండిపోయియి. వికారాబాద్ జిల్లాలోని నా లుగు మున్సిపాల్‌లో ఇంకుడుగుంతలు నిర్మించడానికి మున్సి పాల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ,నాలుగు మున్సిపాల్లో స్థానిక సంస్థల జిల్లా అధికారి అదనపు కలెక్టర్ చర్యలు తీసుకో వాలని ప్రజలు ,జలసంరక్ష అధికారులు కోరుతున్నారు.

## ఆశా వర్కర్లకు పరీక్షల విధానాన్ని రద్దు చేయాలి

### తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఆశా వర్కర్లకు నష్టం కల్గించే విధంగా పరీ క్షలు నిర్వహించే ప్రభుత్వ ఆలోచనను విరమించుకొని చిరకాల సమస్యల పరిష్కరించాలని తెలంగాణా ఆశా వర్కర్ల యూనియన్(సిఐటియు) సంస్థ శ నివారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ. హేమలత, ఎం. రేవతి కళ్యాణిలు మాట్లాడారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 19 ఏళ్లుగా పని చేస్తూ ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణా కార్యక్రమా ల్లో పాల్గొని తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నార న్నారు. తమకు కేటాయించిన రిజిస్టర్లు నిర్వహించటం, సర్వేలు చేయటం, ఆన్‌లైన్ పనులు చేయటం, బిపి, షుగర్, థైరాయిడ్‌లాంటి వ్యాధి నిర్ధారణ ప రీక్షలు చేసి జబ్బులను గుర్తించి అవసరమైన వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు త రలించటం, మందులను సరఫరా చేస్తుండటం లాంటి పనులను ఆశా వ ర్కర్లు చేస్తున్నారన్నారు. కోవిడ్19 కాలంలో సైతం ఆశా వర్కర్లు సమర్థవం తంగా ప్రాణాలకు తెగించి పని చేయటాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లో బల్ లీడర్స్ అన్న అవార్డును సైతం ఇచ్చారన్నారు. ఇలా సమర్థవంతంగా ప ని చేసే ఆశా వర్కర్లకు మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని గత ప్రభుత్వ నిర్ణయా న్ని రాష్ట్ర వ్యాప్తంగా తాము చేసిన పోరాట ఫలితంగా 2023 జూన్ మా సంలో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆశా వర్కర్ల పరీక్షా నిర్ణయా న్ని రద్దు చేస్తామని ప్రకటించామని వారు గుర్తు చేసారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఆశా వర్కర్ల పరీక్షా నిర్వహణను తేవద్దని, తాము చిరకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ ం తాము కొనసాగించిన సమ్మె విరమణ సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చే పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచటం, ప్రతి నెలా 2వ తేదీలోగా చెల్లించా లని, ఇన్సూరెన్స్ రూ.50 లక్షలుగా చెల్లించాని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ మొత్తాన్ని రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో ఈటల



**పజాపక్షం/చర్లపల్లి:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అ శోక్ నగర్‌లో గల 54 అడుగుల బృహదాంజనేయ స్వామి సన్ని ధిలో హనుమాన్ జయంతిని రా మానుజా సేవా ట్రస్టు చైర్మన్ డా క్టర్ ధనంజయ ఆధ్వర్యంలో ఘ నంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు,మల్కాజ్‌గిరి పా ర్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ రామానుజ మందిరంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ పొం దుతున్న మహిళలను విషయాలు అడిగి తెలుసుకున్నారు.జూన్ 9న పేదల కోసం మెడికల్ సెంటర్‌ను ప్రారంభించనున్నామని ధనంజయ తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను ఆలయ చైర్మన్ ఘనంగా సత్కరించారు.అనంతరం 1000 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరే టర్ పన్నాల దేవేందర్‌రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను అగ్రగామిగా నిలిపిన మహా దార్శనికుడు కెసిఆర్

### ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అడుగడుగునా అవమానాలకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర ఏర్పాటుతో అగ్రగామిగా నిలిపిన మహా దార్శనికుడు మాజీ సిఎం కెసిఆర్ అని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ పిలుపుమేరకు దశాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల్లో భాగంగా గన్ పార్కు నుండి ట్యాంక్ బండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీకి మద్ద తుగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుండి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియామకాల్లో వివక్షకు గురైందని, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని, తెలంగాణ రాష్ట్ర కళ ఏ ఒక్కరి భిక్ష కాదని, నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష అని అన్నారు. కొట్లాడి సాధిం చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో దేశానికే దిక్సూచిగా నిలిపిన ఘనత కెసిఆర్ కే దక్కుతుం దని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో తాగునీరు, సాగునీ టిని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకువచ్చారని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, రైతు బంధు, దళిత బంధు, బిసి బంధు, కెసిఆర్ కిట్‌లు ఇలా అనేక పథకాలతో పేద ప్రజలకు అన్ని విధాలుగా తెలంగాణ తొలి సిఎం అయిన కెసిఆర్ అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రాష్ట్రాన్ని అదోగతి పాలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు, అభివృద్ధి కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగులే టార్గెట్

### ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను ముంచిన దంపతులు



**ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్:** ఐదు జిల్లాల నిరుద్యోగులనే టార్గెట్‌గా చేసు కొని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యో గులను నిండమించి దంపతులు పరారయ్యారు. పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంబాద్ జిల్లా పిట్లం మండలానికి చెందిన సెకావత్ సంతోష్ సుగుణ దంప తులు బతుకుదెరువు కోసం వలస వచ్చి నగర శివారు కొంపల్లి మున్సిపల్ జయభేరి పార్క్ బాలాజీ అపార్ట్మెంట్‌లోని ఫ్లాట్ నెంబర్ 204 లో మూడు సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. పేట్ బషీరాబాద్ లో రాద చికెన్ సెంటర్ ను ప్రారంభించి అది నడిపించుకుంటూ బల్కంపేట కు చెందిన ప్రవీణ్ ను ఆశ్రయించి లోన్ ద్వారా అపార్ట్మెంట్లో ఫ్లాట్ తీసుకున్నాడు. ఇండి యన్ ఎయిర్ఫోర్స్ అకాడమీ లో అకౌంటెంట్గా పని చేస్తున్నానని అందరితో పరిచయం పెంచుకున్నాడు. నిరుద్యోగులే టార్గెట్గా చేసుకోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. మొదటగా ప్రవీణ్ బంధువు నవీన్ గౌడ్ నమ్మించి స్వీపర్ ఉద్యోగం నుంచి ఆఫీసర్ ఉద్యోగం వరకు నేనే ఇప్పిస్తానని నిరుద్యోగులకు ఫేక్ హాల్ టికెట్స్ తో పేటలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ సమీపంలో తన కారు లోపరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత పొంది నట్లుగా సర్టిఫికెట్స్ ని ఇచ్చాడు. ఇలా పరీక్ష రాసిన నిరుద్యోగుల వద్ద ఒక్కొ క్కరి వద్ద ఆరు లక్షల నుండి. 10 లక్షల చొప్పున 54 మంది వద్ద తీసుకున్నాడు. ఇదంతా నిజాంబాద్ జిల్లా కామారెడ్డి మహబూబ్నగర్ మేడ్చల్ సిద్దిపేట జిల్లాల పరిధిలోని నిరుద్యోగులను నమోసం చేసి సుమారు నాలుగు నుండి ఆరుకోట్ల రూపాయలతో ఉడయిం చాడు. ఫేక్ కాల్ లెటర్స్ సర్టిఫికెట్లతో బేగంపేటలోని ఎయిర్పోర్ట్ అకాడమీకు చేరుకొని సంబంధిత అధికారులను కలిసిమా ఉద్యోగాలు ఎక్కడ చేయాలని అమాయకంగా నిరుద్యోగులు అడిగారు. స్పందించిన అధికారులు షేకావత్ సంతోష్ గుట్టు రట్టు చేశారు. తాము మోసపోయామని గ్రహించిన కొందరు నిరుద్యోగులు శనివారం సంతోష్ ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో చేసేది ఏమీ లేక ఆ నిరుద్యోగులంతా లబోదిబోమంటూపదిమంది పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

## విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** విత్తనాల కొనుగోలుపై రైతులు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని శామీర్‌పేట మండల ఏఈవో రవియాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం లోని తుర్కపల్లి,యాడారం గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగో లుపై అవగాహన కల్పించారు. లూజుగా ఉన్న విత్తనాలను కొను గోలు చేయకూడదన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేట ప్పుడు సంబందిత దుకాణం యజమాని నుంచి రశీదు, పేరు, గ్రామం, సెల్ నెంబర్, నమోదు చేసుకోవాలన్నారు. రశీదుతో పాటు విత్తనాల సంచులను పంట కోసే వరకు భద్రపరుచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వార ఆమోదించబడిన దుఖాణంలోనే విత్తనాలు తీసుకోవాలన్నారు. వరి విత్తనాలు శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రమీలా, హనుమాన్‌దాస్, వెంకట్రామి రెడ్డి, నవీన్, చంద్రం, మల్లేష్, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

క్రీడ

# దినేశ్ కార్తీక్ సంచలన నిర్ణయం

## - ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గుడ్‌బై




**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ దినేశ్ కార్తీక్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇటీవల ఐపిఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పిన డికె, తాజాగా అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ మేరకు తన నిర్ణయాన్ని శనివారం ట్విట్టర్‌లో వెల్లడించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన డికె 20ఏళ్ల పాటు టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 'కొన్ని రోజులుగా నాకు మద్దతుగా నిలిచి, నాపై ఆప్యాయత చూపిన ఫ్యాన్స్ అందరికి కృతజ్ఞతలు. ఇక నా కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలని డిసైడ్ అయ్యాను. నా సుదీర్ఘ ప్రయాణంలో నాకు మద్దతుగా ఉన్న కెప్టెన్లు, సెలక్టర్లు, సహచరులు, సహాయక సిబ్బంది అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. దేశంలో మిలియన్ల కొద్ది క్రీడాకారులు ఉన్నప్పటికీ నాకు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నా తల్లిదండ్రులు ఇన్నేళ్లుగా కెరీర్‌లో నాకు పిల్లర్లుగా సపోర్ట్‌గా నిలిచారు. వారి ఆశీర్వాదాలు లేనిదే నేను లేను. నా భార్య దీపికకు నేను ఎంతో రుణపడి ఉంటాను. చివరగా నన్ను అభిమానించే అందరికీ థాంక్యూ' అని ట్విట్టర్‌లో రాసుకొచ్చాడు.

# హార్దిక్, దూబే రోల్స్ వేరు: ఎవరి పాత్ర వారిదే

**న్యూఢిల్లీ :** టి20 వరల్డ్‌కప్ 2024 టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకటిగా టీమ్‌ఇండియా బరిలోకి దిగుతోంది. జూన్ 5న ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌తో ఇండియా వరల్డ్ కప్ వేట మొదలు కానుంది. ఈ క్రమంలో భారత్ ప్లేయింగ్ 11 ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. దీనిపై క్రికెట్ ఎక్స్‌పర్ట్స్, టీమ్ ఇండియా మాజీ ప్లేయర్స్ తమ విశ్లేషణలు వినిపిస్తున్నారు. తాజాగా స్టార్ స్పోర్ట్స్ ప్రెస్ రూమ్‌లో ఇర్ఫాన్ పఠాన్, పేస్ ఆల్ రౌండర్స్‌కి సంబంధించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు. వాస్తవానికి 15 మంది సభ్యులతో టీమ్ ఇండియా స్క్వాడ్‌ని ప్రకటించినప్పుడు, ఇద్దరు పేస్ ఆల్ రౌండర్లు ఎందుకని ప్రశ్నించారు. కొందరు హార్దిక్ పాండ్యకి బ్యాకప్‌గా శివమ్ దూబేని ఎంపిక చేసినట్లు భావించారు. అయితే భారత్ జట్టు ప్లేయింగ్ 11లో ఈ ఆల్ ఆల్ రౌండర్స్ పాత్ర ఎలా ఉండాలో? ఇర్ఫాన్ పఠాన్ వివరించాడు.

**హార్దిక్, దూబే పాత్రలు వేరు**

'హార్దిక్ పాండ్య, శివమ్ దూబే డిఫరెంట్ రోల్స్ పోషిస్తారని నేను భావిస్తున్నాను. గేమ్‌ను ముగించే బాధ్యత హార్దిక్‌కు ఉంటుంది. శివమ్ దూబే ఫ్లోటర్‌గా ఆడతాడు. కనీసం ప్లేఆఫ్స్‌లో స్పిన్నర్లపై ఎదురు దాడి చేసేందుకు బరిలోకి దిగుతాడు' అని చెప్పాడు. భారత్‌కు ఫినిషర్‌గా మరింత ప్రభావవంతంగా ఉండాలంటే హార్దిక్ పాండ్య తన వైడర్ స్టాన్స్‌కి తిరిగి వచ్చేందుకు కృషి చేయాల్సి ఉందని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. హార్దిక్‌ని బ్యాటింగ్ పొజిషన్‌లో ముందుకు తీసుకెళ్లడం వల్ల, అతను తన స్టాన్స్ మార్చుకున్నాడని, దీంతో అతని పేస్ హిట్టింగ్‌పై ప్రభావం పడిందని వివరించాడు.

**హార్దిక్ పాండ్య బౌలింగ్**

భారత్ టీ20 ప్రపంచ కప్ జట్టులో హార్దిక్ పాండ్యా ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు మూడో సీమర్‌గా ఆడవచ్చు. అది జరగాలంటే, ఐపిఎల్ 2024 సీజన్ చివరిలో హార్దిక్ బౌలింగ్‌లో చూపిన ఫామ్‌ని రిపీట్ చేయాలని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. 'హార్దిక్ బౌలింగ్ చేస్తుంటే, అతడు ఐపీఎల్ చివరిలో ఉన్న ఫామ్‌ని కంటిన్యూ చేయాలి.



ఇది అతడి బ్యాటింగ్‌కు కూడా సహాయపడుతుంది. ఎందుకంటే అతను ప్రధానంగా భారత జట్టులో బౌలింగ్ కాకుండా బ్యాటింగ్ ఆల్ రౌండర్‌గా ఆడతాడు. అయితే, ఇది రెండు విధాలుగా పనిచేస్తుంది. మీరు ఒక ప్రాంతంలో బాగా రాణిస్తే, అది మీ విశ్వాసాన్ని పెంచుతుంది' అని తెలిపాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో ముంబయి ఇండియన్స్ తరఫున హార్దిక్ 10.75 ఎకానమీ రేటుతో 11 వికెట్లు తీశాడు. అయితే భారత్ తన ఐసీసీ కలను నెరవేర్చుకోవాలంటే, 11 ఏళ్ల నిరీక్షణను తెరపడాలంటే, హార్దిక్ అంతకంటే మెరుగ్గా రాణించాలి.

# గంభీర్ సరైనోడే: గంగూలీ



**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ ఎంపికపై క్రీడా వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈక్రమంలో మాజీ ప్లేయర్ గౌతమ్ గంభీర్ ఎంపిక దాదాపు ఖరారైందని కొన్ని రోజులుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశాడు. గంభీర్ కోచ్‌గా వస్తే మాత్రం జట్టులో మంచి మార్పు తీసుకొస్తాడని అభిప్రాయపడ్డాడు. 'కోచ్ పదవికి గంభీర్ దరఖాస్తు చేసుకున్నాడో లేదో తెలీదు. కానీ, కోచ్‌గా గంభీర్ ఎంపికైతే మాత్రం అది మంచి నిర్ణయమే. గంభీర్ నిజాయితీపరుడు. ఐపిఎల్‌లో కోల్‌కతాను మెంటార్‌గా విజయవంతంగా నడిపించాడు. టీమ్‌ఇండియాకు హెడ్‌కోచ్ అయ్యేందుకు అన్ని లక్షణాలు గంభీర్‌కు ఉన్నాయి. కానీ, ఐపిఎల్ ఫ్రాంచైజీకి మెంటార్‌గా పని చేయడం, ఇంటర్నేషనల్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించడం రెండూ భిన్నమైన పాత్రలు. భారత్ వంటి అత్యుత్తమ జట్టు విషయంలో ఇది ఇంకా ఒత్తిడితో కూడుకొని ఉంటుంది. అయితే గౌతమ్ గంభీర్‌కు ఇలాంటి వాటిపై పూర్తి అవగాహన ఉంది. విరాట్, రోహిత్ వంటి స్టార్లను ఎలా డీల్ చేయాలనేది తెలుసు. డ్రెస్సింగ్ రూమ్ పరిస్థితులను త్వరగా అలవర్చుకుని కలిసిపోతాడు. తన ఉద్దేశాలే కాకుండా జట్టులోని సభ్యుల ఆలోచనలనూ రిగణనలోకి తీసుకుంటాడు. తప్పకుండా గొప్ప హెడ్ కోచ్ అవుతాడనడంలో సందేహం లేదు. కానీ, ఈ పదవిని తీసుకోవడానికి అతడు అంగీకరిస్తాడా? లేదా? అనేది ఆసక్తికరం' అని గంగూలీ అన్నాడు. ఇక ఇప్పుడున్న కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవి ఈ నెలలోనే ముగుస్తుంది. కొత్తగా బాధ్యతలు చేపట్టే వ్యక్తి 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగుతాడు. చూడాలి మరి బిసిసిఐ ఎవరివైపు మొగ్గు చూపుతుందో? టీమ్‌ఇండియా కొత్త కోచ్‌గా ఎవరు ఎంపికవుతారో? ఈ సస్పెన్స్‌కు త్వరలోనే ఎండ కార్డ్ పడే ఛాన్స్ ఉంది. కాగా, టీమ్‌ఇండియా ప్రస్తుతం టీ20 వరల్డ్‌కప్‌కు సిద్ధమవుతోంది. టోర్నీ ప్రారంభం కంటే ముందుగా శనివారం బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ జరగనుంది. ఇక జూన్ 5న ఐర్లాండతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. జూన్ 9న పాకిస్థాన్‌తో తలపడనుంది.




రీల్

# 'స్వయంభు' నుంచి నిఖిల్ బర్త్‌డే స్పెషల్

టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ హీరోగా సంయుక్త అలాగే నభా నటేష్ లు హీరోయిన్ గా దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం స్వయంభు కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా నుంచి మేకర్స్ నేడు హీరో నిఖిల్ పుట్టినరోజు కానుకగా అయితే ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్ తో శుభాకాంక్షలు తెలియజేసారు. అయితే ఈ పోస్టర్ లో నిఖిల్ తన సాలిడ్ పర్సనాలిటీతో అదిరే లెవెల్లో ఉన్నాడని చెప్పాలి. రెండు చేతుల్లో రెండు కత్తులు పట్టుకొని ఒక సరైన సమరయోధుడిలా తాను కనిపిస్తున్నాడు. దీనితో తన చిత్ర యూనిట్‌కి నిఖిల్ ధన్యవాదాలు తెలిపి తాను ఈ సినిమా షూటింగ్ ప్రతి రోజు కూడా ఎంతో ఎంజాయ్ చేస్తున్నానని తన ఎక్స్‌పీరియన్స్‌ని తెలిపాడు. ఇక ఈ భారీ చిత్రానికి కేజీయఫ్, సలార్ సినిమాల సంగీత దర్శకుడు రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా పిక్సెల్ స్టూడియోస్ వారు భారీ వ్యయంతో నిర్మాణం వహిస్తున్నారు.

వరల్ వైడ్ సాలిడ్ ఓపెనింగ్స్ అందుకున్న

# గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నేహా శెట్టి హీరోయిన్ గా అంజలి మరో ముఖ్య పాత్రలో నటించిన ఇంటెన్స్ యాక్షన్ చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. దర్శకుడు కృష్ణ చైతన్య తెరకెక్కించిన ఈ చిత్రం సాలిడ్ బజ్ నడుమ థియేటర్స్ లో రిలీజ్ కి వచ్చింది. మరి ఈ సినిమా రిలీజ్ అయ్యి కాస్త మిక్స్డ్ రెస్పాన్స్ ని అందుకుంది కానీ డే 1 కి సాలిడ్ బుకింగ్స్ నే వరల్ వైడ్ అందుకుంది. దీనితో మొదటి రోజు సాలిడ్ వసూళ్లే అందుకున్నట్టుగా మేకర్స్ ఇప్పుడు ప్రకటించారు. మరి పి ఆర్ నెంబర్ ప్రకారం ఈ చిత్రం డే 1 కి వరల్ వైడ్ గా 8.2 కోట్ల గ్రాస్ ని అందుకుంది. ఇది విశ్వక్ కెరీర్ లో మరో మంచి నెంబర్ అని చెప్పాలి. ఇక ఈ వీకెండ్ రెండు రోజుల వసూళ్లు ఎలా ఉంటాయి అనేది చూడాలి మరి. ఇక ఈ సినిమాలో ఆయేషా ఖాన్ స్పెషల్ సాంగ్ ని చేయగా యువన్ శంకర్ రాజా సంగీతం అందించాడు. అలాగే సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.

# కల్కి ఇంగ్లీష్ వెర్షన్‌కు బ్రహ్మానందమే



ఇప్పుడు ఇండియన్ సినిమా దగ్గర ఎంతో ఆసక్తి రేపిన భారీ పాన్ ఇండియా చిత్రం కల్కి 2898 ఎడి. రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో ప్లాన్ చేసిన ఈ బిగ్గెస్ట్ సైన్స్ ఫిక్షన్ కం ఫాంటసీ డ్రామా నుంచి నిన్ననే ఓటీటీలో ఇంట్రెస్టింగ్ ప్రీల్యుడ్ రిలీజ్ అయ్యింది. అయితే ఈ ప్రీల్యుడ్ ని మేకర్స్ తెలుగు సహా ఇంటర్నేషనల్ ఆడియెన్స్‌కి రీచ్ అయ్యే విధంగా ఇంగ్లీష్‌లో కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ ఇంగ్లీష్ వెర్షన్‌లో తన పాత్రకు తానే హాస్య బ్రహ్మ బ్రహ్మానందం డబ్బింగ్ చెప్పుకోవడం ఫ్యాన్స్ లో క్రేజీ గా మారి వైరల్ అవుతుంది. ఇంగ్లీష్ వెర్షన్ లో కూడా బ్రహ్మీ తన మార్క్ కామెడీ టైమింగ్ పంచడం విశేషం. మరి ఇది ఓటీటీ వరకేనా థియేట్రికల్‌గా కూడా ఉంటుందా అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ భారీ చిత్రం నుంచి ఎన్ని సర్ప్రైజ్‌లు ఉన్నాయో వేచి చూడాలి. ఇక ఎలాగో జూన్‌లోకి వచ్చేసాం.. దీనితో కల్కి నెల మొదలై మరిన్ని ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ రానున్నాయి అని చెప్పాలి.

# రిలీజ్ డేట్ లాక్ చేసుకున్న 'యేవమ్'




లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి రిజల్ట్ అందిస్తుంటారు. ఈ కోవలో గతంలో చాలా సినిమాలు వచ్చి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు మరో లేడీ ఓరియెంటెడ్ మూవీ ప్రే క్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. య ంగ్ బ్యూటీ చాందినీ చౌదరి మెయిన్ లీడ్లో న టిస్తున్న 'యేవమ్' షూటింగ్ పనులు ముగి ంచుకుని రిలీజ్కు రెడీ అయ్యింది. ప్రకాశ్ దంతు లూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో చా ందినీ ఓ లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తోంది. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్గా రాబోతున్న ఈ సిని మాకు సంబంధించిన రిలీజ్ డేట్ను మేకర్స్ తా జాగా అనౌన్స్ చేశారు. జూన్ 14న ఈ సి నిమాను ప్రేక్షకుల ముందుకు తీసు కొస్తు న్నట్లు వారు ప్రకటించారు. ఈ సినిమాలో వశిష్ట సి ంహా, భరత్ రాజ్, అషు రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. నవ్దీప్, పవన్ గో పరాజు ఈ చిత్రాన్ని సంయుక్తంగా ప్రొ డ్యూస్ చేస్తున్నారు. కాగా, కీర్తన శేష్, నీలేష్ మందలపు ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

# 'ఇండియా'దే తదుపరి ప్రభుత్వం

## అధికార ఎన్‌డీఏ నిష్క్రమించబోతోంది

## ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్



**పాట్నా :** తమ పార్టీ భాగమైన ఇండియా కూటమి కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, అధికారంలో ఉన్న బీజేపీ నేతత్వంలోని ఎన్‌డీఏ నిష్క్రమించబోతోందని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ శనివారం నొక్కి చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్ష సంకీర్ణానికి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించిన బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఓటు వేసిన తర్వాత ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత 'ఇండియా' సంకీర్ణం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎన్‌డీఏ నిష్క్రమించబోతోంది' అని 34 ఏళ్ల నాయకుడు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్‌పై కాంగ్రెస్ సందేహాన్ని మిత్రపక్షమైన ఆర్‌జేడీ పంచుకున్నట్లు కనిపించింది. ఎన్నికల అనంతరం సర్వేలపై టీవీ చర్చల్లో పాల్గొనకూడదని ఆర్‌జేడీ తీసుకున్న నిర్ణయం గురించి అడిగినప్పుడు, 'ఈ ఎగ్జిట్ పోల్‌లను నిర్వహిస్తున్న వ్యక్తులు ఎవరు? వీటిలో దేనిని మనం సీరియస్‌గా తీసుకోవాలి? వాస్తవం ఏమిటంటే, మేము క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉన్నాము. ప్రజల మానసిక స్థితి గురించి మాకు ప్రత్యక్ష అవగాహన ఉంది' అని తేజస్వి నొక్కి చెప్పారు. సంకీర్ణానికి మెజారిటీ తక్కువ వచ్చినప్పుడు మిత్రపక్షాలు విడిపోకుండా నిరోధించే లక్ష్యంతో ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం ఏర్పాటు చేశారన్న వాదనలను ఆర్‌జేడీ నాయకుడు తోసిపుచ్చారు. 'నేను సమావేశంలో ఉంటాను. అజెండాలో ఏమి ఉందో మేము మీ అందరికీ తెలియజేస్తాము' అని పేర్కొన్నారు. కన్యాకుమారిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్యానం గురించి వ్యాఖ్యానించవలసిందిగా కోరినప్పుడు, 'అది 'ఒక ఫొటో ప్రచార యావ'. రాజ్యాంగాన్ని రక్షించడానికి, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రభుత్వాన్ని శిక్షించడానికి ఓటు వేసిన ప్రజలలో ఆ అంశం లేదు' అని తెలిపారు.తరువాత భార్య, చిన్న కుమార్తెతో కలిసి విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

# ప్రజ్వల్ రేవణ్ణ తల్లి పరారీ



**బెంగళూరు:** దేశవ్యాప్తంగా కలకలం రేపిన హసన్ అశ్లీల వీడియో, కిడ్నాప్ కేసుల్లో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మహిళలపై లైంగిక దౌర్జన్యం, బ్లాక్‌మెయిల్ ఆరోపణలతో హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణపైనా ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు పోలీసులు ఇంటికి వెళ్లగా ఆమె అందుబాటులో లేరు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. రేవణ్ణ ఇంటి పనిమనిషి కిడ్నాప్ ఘటనలో భర్త రేవణ్ణతో పాటు భవానీకి కూడా సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమెను విచారించేందుకు సిట్ అధికారులు ఆమెకు నోటీసులు పంపారు. శనివారం ఇంటికి వచ్చి ప్రశ్నిస్తామని అందులో పేర్కొన్నారు. ఆమెను అరెస్టు చేసే అవకాశం ఉందని ఊహాగానాలతో ఉదయం సిట్ అధికారులు శెనరసీపురలోని ఆమె నివాసానికి వెళ్లగా భవానీ అక్కడ కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది.

# కేరళలో భారీ వర్షాలు

## విరిగిపడుతున్న కొండచరియలు

## అనేక ప్రాంతాలు జలమయం

## పర్వత ప్రాంత జిల్లాల్లో విధ్వంసం

## రెడ్ అలర్ట్ ప్రకటించిన ఐఎండీ



తిరువనంతపురం : నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన రెండు రోజుల తర్వాత కేరళలో అవి మరింత విస్తరించటంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, మధ్య జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, చెట్లు నేలకూలడం, భారీగా వర్షం నీరు నిలిచిపోవడం జరిగింది. గంటల తరబడి కురుస్తున్న వర్షాలకు కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం ఏర్పడగా, త్రిసూర్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తన వాతావరణ హెచ్చరికను నవీకరించింది. మధ్య జిల్లా త్రిసూర్, ఉత్తర జిల్లాలయిన మలప్పురం, కోజికోడ్‌ను శనివారం రెడ్ అలర్ట్‌లో ఉంచింది. ఇడుక్కి, పాలక్కాడ్, వయనాడ్‌లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రెడ్ అలర్ట్ 24 గంటల్లో 20 సెం.మీ కంటే ఎక్కువ భారీ నుంచి అతి భారీ వర్షాన్ని సూచిస్తుంది. అయితే ఆరెంజ్ అలర్ట్ అంటే 11 సెం.మీ నుంచి 20 సెం.మీ వరకు అతి భారీ వర్షాన్ని సూచిస్తుంది. ఎల్లో అలర్ట్ అంటే 6 సెం.మీ, 11 సెం.మీ మధ్య భారీ వర్షపాతాన్ని సూచిస్తుంది. పర్వత ప్రాంత జిల్లా ఇడుక్కి అంతర్భాగంగా ఉన్న పూచాప్రా, కొలప్ర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కొండచరియలు విరిగిపడటంతో పాటు చెట్లు నేలకొరిగాయి. కొండచరియలు విరిగిపడడంతో కొన్ని ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయని, అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. కొండపై నుంచి భారీ గ్రానైట్ బండరాళ్లు పడిపోయి పంటలు ధ్వంసమయ్యాయి. అలాగే, స్థానికులు వినియోగించుకునే అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. 'మేము ఇటువంటి ఘోరాన్ని ఎదుర్కొన్నాం. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. గ్రానైట్ బండరాళ్లు, భారీ రాళ్లు, ఇసుక కిందకు జారాయి. చెట్లు ఎగిరి కిందకు వస్తున్నట్లు మాకు అనిపించింది' అని ఒక గ్రామస్తుడు తన భయానక అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. కొండ ప్రాంతంలో నివాసముంటున్న ఓ కుటుంబం ఇంటిపై రాళ్లు పడడంతో తటిలో తప్పించుకున్నారు. అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. బురదజల్లే ప్రమాదం ఉన్నందున తొడుపుజాపులియన్మల రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇడుక్కిలోని మలంకర డ్యామ్ ఐదు షట్టర్లను తెరవడంతో జిల్లా అధికారులు తొడుపుజా, మువత్తుపుజా నదుల ఒడ్డున నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొరుగున ఉన్న కొట్టాయం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో మీనాచల్, మణిమాల నదుల సమీపంలో నివసించే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొట్టాయంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి గంటల తరబడి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి వడవత్తూరు ప్రాంతంలో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కొట్టాయం పట్టణ ప్రాంతాల్లో 99 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. ఓడరేవు నగరం కొచ్చిలో మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ, ఎర్నాకులంలోని అలువా ప్రాంతంలో మే 31 రాత్రి నుంచి తీవ్రమైన వర్షాలు కురుస్తున్నాయి. మధ్య జిల్లా త్రిసూర్‌లో శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ప్రజలు పెద్ద సంఖ్యలో బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లలో చిక్కుకున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తాజా రాడార్ చిత్రాల ప్రకారం, త్రిస్సూర్‌లో గంటకు 40 కి.మీ వేగంతో గాలులు వీయడంతో పాటు ఒక మోస్తరు ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధాన రహదారులు జలమయం కావడం, వాహనాలు సరిగా కనిపించకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ తీరాల్లోని అనేక ప్రాంతాల్లో వర్షం నీరు పొంగిపొర్లుతుందని హెచ్చరించారు. ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని వారు కోరారు. నైరుతి రుతుపవనాలు కేరళ, ఈశాన్య ప్రాంతంలో మే 30న ప్రవేశించాయి.



# ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

**చెన్నై:** తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సుదీర్ఘ ధ్యానం శనివారం ముగిసింది. గురువారం సాయంత్రం 6.45 గంటలకు ప్రారంభమైన ధ్యానం 45 గంటలపాటు కొనసాగింది. ఈ క్రమంలోనే ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, త త్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోదీ పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానంద శి లాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటు చేసిన 133 అడుగుల ఎత్తయిన ఈ భారీ విగ్రహం వ ద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. అనంత రం కన్యాకుమారి తీరానికి తిరిగివచ్చారు. సా ర్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వె ంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ... త మిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శిలాస్మారకాన్ని చేరుకుని గురువారం సాయంత్రం మో దీ ధ్యానం ప్రారంభించారు. ఈ సమయంలో ఆ యన కేవలం ద్రవాహారం... అంటే కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మౌనంగా ఉంటారని, మెడిటేషన్ హాల్ నుంచి బయటకు రారని తెలిపాయి. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు.

# అక్రమ నగదు బదిలీ కేసులో ప్రభుత్వం ఎవరినీ రక్షించదు

## కర్నాటక సీఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** కర్నాటక మహర్షి వాల్మీకి గిరిజన తెగల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన అక్రమ నగదు బదిలీ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఎవరినీ రక్షించదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం ప్రకటించారు. అక్రమ నగదు బదిలీ కేసులో సీబీఐ విచారణను కోరుతూ, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖ మంత్రి బి.నాగేంద్రను బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ చేసిన కొన్ని గంటల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. మంత్రి నాగేంద్రను తొలగించాలని బీజేపీ డిమాండ్ చేయడంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఎవరినీ రక్షించము. ఎవరైనా సరే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాము' అని తెలిపారు. కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ మే 26న ఆత్మహత్యాయత్నానికి పాల్పడి డెత్ నోట్‌ను వదిలివేయడంతో అక్రమ నగదు బదిలీ వెలుగులోకి వచ్చింది. కార్పొరేషన్‌కు చెందిన రూ.187 కోట్లను దాని బ్యాంక్ ఖాతా నుంచి అనధికారికంగా బదిలీ చేసినట్లు వెల్లడించింది. దాని నుంచి రూ.88.62 కోట్లు 'ప్రసిద్ధ' ఐటీ కంపెనీలకు, హైదరాబాద్‌కు చెందిన ఒక సహకార బ్యాంకుకు తరలించినట్లు పేర్కొంది. చంద్రశేఖర్ ఇప్పుడు సస్పెండ్ చేయబడిన కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.జి.పద్మనాభ్, అకౌంట్స్ ఆఫీసర్ పరశురామ్ జి దురుగన్నవర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుచిస్మిత రావల్‌ను నోట్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో నిధులను బదిలీ చేయడానికి 'మంత్రి' మౌఖిక ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కోసం బెంగళూరులోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్థిక నేరాల అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మనీష్ ఖర్బీకర్ నేతృత్వంలో నలుగురు సభ్యుల సిట్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఎవరినీ రక్షించదని, ఎవరినీ విడిచిపెట్టబోదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీ రాజకీయాలు చేస్తోంది, నేను వారిని ప్రశ్నించను.. బీజేపీ హయాంలో కూడా ఇలాంటివి జరిగాయని బసవరాజ్ బొమ్మైకి తెలుసు. అందరికి కూడా తెలుసు. కేసు దర్యాప్తు చేస్తున్నాం. ఎవరినీ విడిచిపెట్టము' అని తెలిపారు. ఈ కేసులో మంత్రి నాగేంద్రకు ప్రత్యక్ష ప్రస్తావన లేదని శివకుమార్ అన్నారు. 'ఏదైనా పత్రాలు లేదా రుజువులు లేదా ఏదైనా ప్రమేయం దొరికితే, ఏది చేయవలసి ఉన్నా, ప్రభుత్వం తప్పకుండా చేస్తుంది. ప్రభుత్వం పారదర్శకంగా ఉంది. ఎవరినీ విడిచిపెట్టే ప్రశ్నే లేదు. మేము చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం డబ్బు మాకు ముఖ్యం. మా అధికారులు దానిని కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు' అని వివరించారు. ఇంకా రెండు రోజులు సమయం కావాలని డిప్యూటీ సీఎం చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని, కొన్ని అరెస్టులు చేశామని, ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, మంత్రి నాతో, సీఎంతో మాట్లాడారని, దీనిపై విచారిస్తున్నామని ఆయన తెలిపారు. సీబీఐ దర్యాప్తు డిమాండ్‌పై మాట్లాడుతూ బ్యాంకు మోసం కేసులో కొన్ని కోట్ల కంటే ఎక్కువ డబ్బు ప్రమేయం ఉంటే, సహజంగానే కేసు సీబీఐకి వెళుతుందన్నారు. ఇదిలాఉండగా, కార్పొరేషన్‌లో అవకతవకలకు గురైన డబ్బు 'లబ్ధిదారుల్లో' ఐటీ సంస్థ హ్యాపీయెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతా కూడా ఉందని మీడియా నివేదికల మధ్య, ఆ బ్యాంకు ఖాతా తమకు చెందదని కంపెనీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.